
నవతెలంగాణ 1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
గురువారం 6 జులై 2023



పంట నష్టపరిహారం అందని ద్రాక్షేనా!



- రెండు దఫాలుగా అకాల వర్షాలు
- యాసంగి పంటలకు తీవ్ర నష్టం
- 6409 ఎకరాల్లో పంట నష్టాన్ని గుర్తించిన వ్యవసాయ శాఖ
- ఎకరాలకు రూ.10 వేల చొప్పున రూ.6.40 కోట్లు మంజూరు
- నష్టపరిహారం కోసం రైతుల ఎదురుచూపు
- ఖరీఫ్ పెట్టుబడులకు తిప్పలు: రైతు సంఘం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లాలో అకాల వర్షాల వల్ల వేల ఎకరాల్లో పంట నష్టమేర్పడింది. సంగారెడ్డి జిల్లాలో రెండు దఫాలుగా కురిసిన అకాల వడగండ్ల వానల వల్ల అత్యధికంగా వరి, మామిడి, మొక్కజొన్న, ఉల్లి వంటి పంటలకు నష్టం జరిగింది. సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ డివిజన్ పరిధిలోనే అత్యధికంగా పంటలు దెబ్బతిన్నాయి. యాసంగిలో సాగు చేసిన వరి పైర్లు కోత దశకొచ్చిన సమయంలో జిల్లాలో అకాల వర్షాలు కురిశాయి. భారీ వర్షం, వడగండ్లు పడడమే కాకుండా బలమైన గాలులు వీచాయి. దీంతో వరి పైర్లలో వడ్లు నేలరాలిపోయాయి. పైర్లు నేలవాలి నీటిలో మునిగిపోయాయి. వేల ఎకరాల్లో పైర్లు కోయకుండానే రైతులు వదిలేయాల్సి వచ్చింది. వర్షపు నీరు పొలాల్లో నిల్వ ఉండడం వల్ల ఉల్లిపంట కుళ్లిపోయింది. మొక్కజొన్న కంకులు కుళ్లిపోయాయి. మామిడి కాయలు రాలిపోయాయి. చేతికొచ్చిన పంట వర్షం పాలవ్వడంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఆరుగాలం కష్టం నేలపాలవ్వడంతో తీవ్రంగా నష్టపోయారు.

6409 ఎకరాల్లో పంట నష్టం

అకాల వర్షాల వల్ల ఏర్పడిన పంట నష్టాన్ని వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం పంట నష్టపరిహారం ఇస్తామని ప్రకటించడంతో జిల్లాలో అధికారులు అంచనా వేసి నివేదికలు తయారు చేశారు. అకాల వర్షాల వల్ల ఎక్కడెక్కడ ఏఏ రకాల పంటలు దెబ్బతిన్నాయనేది పరిశీలించారు. గ్రామాల వారిగా రైతు వారిగా ఏ రకమైన పంట నష్టపోయిందనేది మండలాల వారిగా నివేదికలు తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు పంపారు. జిల్లా స్థాయిలో పంట నష్టం వివరాలపై సమీక్షించి తుది నివేదికను ప్రభుత్వానికి పంపారు. రెండు సార్లు కురిసన వర్షాలకు సంగారెడ్డి జిల్లాలో 6409 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయని అధికారులు గుర్తించారు. కోహీర్, జహీరాబాద్, మొగుడంపల్లి, ఝరాసంఘం, న్యాల్‌కల్, రాయికోడ్, మునిపల్లి, వట్‌పల్లి, ఆందోల్, సదాశివపేట, కంది, కల్హేర్, మనూరు, నాగల్‌గిద్ద, హత్నూర, సంగారెడ్డి మండలాల్లో పంట నష్టం వాటిల్లింది. మొదటి సారి మార్చి 16 నుంచి కురిసిన అకాల వడగండ్ల వానలకు జిల్లా వ్యాప్తంగా 4047 ఎకరాల్లో వివిధ పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఆ తర్వాత ఏప్రిల్ 27 నుంచి కురిసిన వర్షాలతో జిల్లాలో 2362 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రెండు సార్లు కురిసిన అకాల వర్షాల వల్ల జిల్లాలోని 258 గ్రామాల్లో పంట నష్టమేర్పడింది.

అందని రూ.6.40 కోట్ల పరిహారం

పంట నష్టపరిహారాన్ని విడుదల చేయలేదు. పంట నష్టంపై సీఎం కేసీఆర్ స్వయంగా పరిశీలన చేశారు. రైతులు తీవ్రంగా నష్టపోయినందున ప్రభుత్వం వారిని ఆదుకుంటుందని ప్రకటించారు. ఎకరాకు రూ.10 వేల చొప్పున నష్టపరిహారం ఇస్తామని చెప్పారు. ఈ మేరకు రాష్ట్రమంతటా పంటనష్టాన్ని అంచనా వేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మంత్రి హరీష్‌రావు పర్యటించారు. పంట నష్టం పరిశీలించి నివేదిక ఇవ్వాలని అధికారుల్ని కోరారు. దీంతో అధికారులు రెండు సార్లు కురిసిన వర్షాలకు 6409 ఎకరాల్లో నష్టమేర్పడినట్లు గుర్తించారు. ఎకరాకు రూ.10 వేల చొప్పున పంట నష్టపోయిన 3093 మంది రైతులకు రూ.6 కోట్లా 40 లక్షలా 90 వేలు అందజేయాల్సి ఉంది. జిల్లా కలెక్టర్ ఈ మేరకు జిల్లాకు నష్ట పరిహారం మంజూరైనట్లు ప్రకటించారు. పంట నష్టపోయి రెండు నెలలైనా ఇంకా పరిహారం విడుదల కాలేదు.

ఖరీఫ్‌కు ఇబ్బందులు పడుతున్న రైతులు



పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందకపోవడంతో ఖరీఫ్‌లో పంటలు సాగు చేసేందుకు పెట్టుబడుల్లేక ఇబ్బంది పడుతున్నారు. యాసంగి పంట చేతికొచ్చే దశలో వర్షాలు పడి పాడైంది. దీంతో పైసా ఆదాయం రాలేదు. యాసంగీలో సాగు కోసం పెట్టుబడులకు అప్పు ఇచ్చిన వాళ్లకు తిరిగి చెల్లించలేదు. దీంతో ఖరీఫ్‌కు పెట్టుబడులు పుట్టే పరిస్థితి లేకుండా పోయింది. ప్రభుత్వం వెంటనే పంట నష్టపరిహారం నిధుల్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలి.

– రాజయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

అకాల వర్షాలు అన్నదాతల్ని అతలాకుతలం చేశాయి. యాసంగి పంట చేతికొచ్చే వేళ వడగండ్ల వానలు పడి పాడు చేశాయి. పంటంతా నేలరాలింది. వరి, మామిడి, మొక్కజొన్న, ఉల్లి ఇతర పంటలన్నీ దెబ్బ తిన్నాయి. అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు పరిహారం ఇస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు. స్వయంగా ఆయనే పాడైన పంటల్ని పరిశీలించారు. ఎకరాకు రూ.10 వేల నష్టపరిహారం ఇస్తామని ప్రకటించారు. మంత్రులు సైతం జిల్లాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని అధికారుల్ని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఇంత వరకు రైతులకు నష్టపరిహారం అందని ద్రాక్షే అయ్యింది.

నిధులు విడుదలవగానే ఖాతాల్లో జమ



పంట నష్టపరిహారం నిధులు విడుదల కాగానే రైతుల ఖాతాల్లో జమ చేయబడతాయి. జిల్లాలో పంట నష్టం నివేదికను కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపాం. మార్గదర్శకాల మేరకు పంట నష్టం గుర్తించడింది. ప్రభుత్వంనుంచి నిధులు త్వరలో విడుదల కావచ్చు. నిధులు రాగానే నేరుగా రైతుల ఖాతాల్లోనే వేయబడతాయి.

– నర్సింహారావు, జిల్లా వ్యవసాయ అధికారి

ఎమ్మెల్యేకు భూ కబ్జాల మీద ఉన్న ఆసక్తి రైతుల మీద లేదు



సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

నవ తెలంగాణ కొమురవెల్లి

స్థానిక ఎమ్మెల్యేకు భూకబ్జాల మీద ఉన్న ఆసక్తి రైతుల మీద లేదని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. బుధవారం కొమురవెల్లి మండల కేంద్రంలో సనాది భాస్కర్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సందర్భంగా మాట్లాడారు వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు పదివేల సాయం అందిస్తామని ఇంకా ఎందుకు ఇవ్వలేదని స్థానిక ఎమ్మెల్యేను ప్రశ్నించారు కొమురవెల్లి మండలాన్ని మంత్రులు ఎమ్మెల్యేలు పలుమారు పర్యటించిన రైతాంగ సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. నిరుపేదలందరికీ ఇండ్లు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వం స్థలం ఉన్నవారికి 5 లక్షల రూపాయలు గృహలక్ష్మి పథకం కింద ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పథకాలను బి ఆర్ఎస్ కార్యకర్తలకు కాకుండా నిజమైన నిరుపేద లబ్ధిదారుల కు అందేలా చూడాలని అన్నారు. ఎన్నికల హామీ అయిన లక్ష రూపాయల రుణమాఫీ ఇంకా ఎన్నాళ్లకు చేస్తారని ప్రశ్నించార్ను రైతాంగానికి బ్యాంకుల్లో రుణాలు రాక ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేస్తున్నారని అన్నారు. రైతాంగ సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు, ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి దాసరి కళావతి, మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, ఐనాపూర్ రాంసాగర్ సర్పంచ్ లు చెరుకు రమణారెడ్డి, తాడూరి రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, బండ కింద అరుణ్ కుమార్, వుల్లంపల్లి సాయిలు, తేలు ఇస్తారి, మేకల కృపాకర్, బక్కెల్లి బాలకిషన్, అత్తినీ శారద, తాడూరు మల్లేష్, స్వామి, తదితరులు పాల్గొన్నారు

పారిశ్రామి వాడల్లో జీపుజాత



ఐదు రోజుల పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలో పర్యటన

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్‌లో కనీస వేతనాలు సవరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాత ఉమ్మడి మెదక్ జిల్లాలో ఐదు రోజుల పాటు కొనసాగనుంది. ఈ నెల 4న రంగారెడ్డి జిల్లా కాటేదాన్‌లో ప్రారంభమైన జీపుజాత బుధవారం సాయంత్రం సంగారెడ్డి జిల్లాలోకి ప్రవేశించింది. 6, 7, 8, 9, 10 తేదీల్లో సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లోని పలు పారిశ్రామిక ప్రాంతాల్లో జీపుజాతా పర్యటన కొనసాగనుంది. జీపు జాతాలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్, భూపాల్ పాల్గొంటారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లోని పారిశ్రామిక వాడల్లో జీపుజాతాను జయప్రదం చేసేందుకు మూడు జిల్లాల సీఐటీయూ కమిటీలో ఏర్పాట్లు చేశాయి.

జీపుజాత షెడ్యూల్: సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాత గురువారం సంగారెడ్డి జిల్లాలో పర్యటించనుంది. పారిశ్రామిక వాడల్లో పర్యటించే జీపుజాతా బృందం వివిధ కంపెనీల్లో పనిచేస కార్మికుల్ని కలువనుంది. కార్మికుల కనీస వేతనాలు, ఇతర సదుపాయాల గురించి తెలుసుకుంటుంది. జీపుజాత షెడ్యూల్ ఇలా ఉంది. గురువారం ఉదయం 5.30 గంటలకు చెర్యాలలోని ఎసీఈ టైర్స్, 8 గంటలకు గుండ్లమాచనూర్, 10 గంటల నుంచి 12.30 వరకు సీబీఎల్ కంపెనీలో ఉంటుంది. మధ్యాహ్నం భోజనం తర్వాత 1 గంటలకు కొండాపూర్ మండలంలోని మల్లెపల్లిలోని పరిశ్రమలు, 2.30 గంటల నంచి 3.30 గంటల వరకు ఎంఆర్ఎఫ్ కంపెనీ, 4.30 గంటలకు జహీరాబాద్‌లోని మహేంద్ర కంపెనీలో పర్యటించి సాయంత్రం 6 గంటలకు సంగారెడ్డికి చేరుకుని రాత్రి బస చేస్తారు. 7వ తేదీన ఉదయం 5.30 గంటలకు పటాన్‌చెరు ప్రాంతం రుద్రారంలోని ఎంఎస్ఎన్ కంపెనీ, 7.30 గంటల నుంచి 10 గంటల వరకు పాశమైలారం, 2 గంటలకు కిర్బి సెంటర్, సాయంత్రం 5 గంటలకు పటాన్‌చెరులో సభ ఉంటుంది. రాత్రి అక్కడే బస చేస్తారు. 8వ తేదిన జిన్నారం మండలంలో ఉదయం 5.30 గంటల నుంచి 12.30 గంటల వరకు బొంతపల్లి పారిశ్రామిక ప్రాంతంలో జాపుజాత పర్యటిస్తుంది. మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు గడ్డపోతారం, 3.30 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు బొల్లారంలో పర్యటిస్తుంది. 9వ తేదిన ఉదయం 5.30 మెదక్ జిల్లాలోని కాళ్లకల్, 8 గంటలకు తూప్రాన్‌లోని కురాచం, మధ్యాహ్నం 1 తూప్రాన్, సాయంత్రం 5 శంకరంపేటలో పర్యటిస్తుంది. 10వ తేదీన ఉదయం 6 గంటలకు సిద్దిపేట జిల్లాలోని కరకపట్లలో పర్యటించి సాయంత్రం 5 గంటలకు గజ్వేల్‌కు చేరుకుంటుంది.

రూ.5 లక్షల బీమాతో రైతులకు భరోసా

- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-నంగునూరు

దురదృష్టవశాత్తు రైతు మృతి చెందితే గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, సీఎం కేసీఆర్ ప్రభుత్వం రూ.5 లక్షల రైతుబీమా అందిస్తూ ఆ రైతు కుటుంబాలకు భరోసాగా నిలుస్తున్నదని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. నంగునూరు మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో సీసీ రోడ్డు, డంపింగ్ యార్డు, గోపాలకృష్ణ యాదవ సంఘం భవనం, ఓపెన్ జిమ్, పల్లె ప్రకృతి వనం, రెడ్డి కమ్యూనిటీ హాల్, గొర్రెల హాస్టల్, రైతు వేదిక, వెంకటాపూర్– మగ్దుంపూర్ బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. సర్పంచ్ రేకులపల్లి భాగ్యలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ దేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే నాణ్యమైన విద్యుత్తు ఉన్నదని, పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటకలో 3, 4 గంటలు మాత్రమే కరెంటు ఇస్తున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో అన్నీ రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని, కాళేశ్వరం ప్రాజెక్టుతో సాగు నీరు అందించామని వివరించారు.

ఇళ్లపై కరెంటు తీగల తొలగింపు బాధ్యత నాదే

వెంకటాపూర్ గ్రామ ఇళ్లపై కరెంటు తీగల తొలగించడానికి విద్యుత్తు శాఖకు డబ్బులు కట్టాల్సి ఉంటుందని, తానే సొంతగా డబ్బులు కట్టి ఇళ్లపై కరెంటు తీగలు తొలగించే బాధ్యత తీసుకుంటానని మంత్రి తీపి కబురు చెప్పారు. రూ.60 లక్షలతో గ్రామాభివృద్ధిలో భాగంగా సీసీరోడ్లు వేశామని, ఎస్సీ కాలనీ వాసులకు వారంలో గృహలక్ష్మీ మంజూరు చేస్తానని హామీనిచ్చారు. రూ.160 కోట్ల రూపాయల వ్యయంతో నేరుగా దుద్దెడ వరకూ రోడ్డు నిర్మిస్తున్నట్లు, అలాగే గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం నిధులు విడుదలైనట్లు, స్థలం వెతికి నిర్మిద్దామని, గ్రామంలో పలు అసంపూర్తి కుల సంఘ భవనాలకు నిధులు మంజూరు చేస్తానని హామీనిచ్చారు.గ్రామ రైతులు ఆయిల్ ఫామ్ పంటలపై దృష్టి సారించాలని, రైతులకు రైతు బంధు సాయం అందించామని తెలిపారు.జిల్లా కేంద్రంలోని సిద్దిపేటలో వెయ్యి పడకల ఆసుపత్రి నిర్మించినట్లు మరో నెలలో అందుబాటులోకి తేనున్నట్లు పేర్కొన్నారు. మరో రెండు నెలల్లో సిద్దిపేటకు రైలు రానున్నదని, ఇప్పటికే సిద్దిపేటలో పంటలు, పశువులు, మనుషుల డాక్టర్ల చదువులు ఉన్నాయని మంత్రి చెప్పారు. ఎకరాకు 80 వేలు సబ్సిడీ ఇస్తున్నదని, నర్మెట్టలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ వచ్చిందని, ఆయిల్ ఫామ్ సాగులో గ్రామ రైతులు ముందుకు రావాలని, కూరగాయల సాగులో వెంకటాపూర్ గ్రామం ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు.

స్వరాష్ట్ర సాధనతోనే ఆలయాల అభివృద్ధి

నవ తెలంగాణ కొమురవెల్లి

తెలంగాణ ఏర్పాటు తర్వాతే కొమురవెల్లి మల్లన్న దేవాలయం దినదినాభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయం వద్ద క్యూ-లైన్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు మంత్రి హరీశ్ రావు భూమి పూజ చేశారు. అంతకుముందు స్థానిక జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదిరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌తో కలిసి మల్లన్నకు పట్టం వేసి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ కొమురవెల్లి మల్లన్న దివ్య క్షేత్రంలో రూ.12 కోట్ల వ్యయంతో క్యూ లైన్ కాంప్లెక్స్ నిర్మాణంతో భక్తులకు ఎంతో సౌకర్యం జరుగనుందన్నారు.



తెలంగాణ వచ్చిన తర్వాత కొమురవెల్లి మల్లన్న దేవాలయం దినదినాభివృద్ధి చెందుతుందని.. మల్లన్నకు ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ వచ్చి స్వామివారి కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో దేవాలయ అభివృద్ధికై రూ.36 కోట్లు వెచ్చించి వివిధ అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపట్టినట్లు వెల్లడించారు. మల్లన్న కల్యాణోత్సవంలో ఇచ్చిన హామీ మేరకు మల్లన్నకు బంగారు కిరీటం, వెండి తలుపులు, వెండి ముఖద్వారాలు చేయించినట్లు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టు లోని అతిపెద్ద మల్లన్న సాగర్ జలాశయం ప్రారంభించి ఆ జలాలు తెచ్చి మల్లన్న కాళ్లు కడిగి సీఎం కేసీఆర్ మొక్కులు చెల్లించుకున్నారని గుర్తు చేశారు. అలాగే దేవాలయ ఆవరణలోని గుట్టపై 100 గదులతో సత్రాలు త్వరితగతిన పూర్తి చేసుకుంటున్నామని తెలిపారు. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, లు దాసారం గుట్టపై గెస్ట్ హౌస్ ల నిర్మాణం సొంత డబ్బులతో చేపడుతున్నారని గుట్టపైకి రోడ్డు నిర్మాణం కూడా దాదాపు పూర్తయిందన్నారు .గతంలో మల్లన్న ఆలయానికి రూ.4, నుండి 5 కోట్లు ఆదాయం మాత్రమే వచ్చేదని, కానీ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత దినదినాభివృద్ధి చెంది ఇవాళ రూ.18 కోట్ల మేర ఆదాయం వస్తుందని మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గిస భిక్షపతి, ఈఓబాలాజీ, ఏఈఓలు, అంజయ్య, శ్రీనివాస్, ఎంపీపీ తలారి కీర్తన, జడ్పీటీసీ సిద్దప్ప, సర్పంచ్ సార్ల లత కిష్టయ్య,ధర్మకర్తలు, అర్చకులు, ఒగ్గు పూజారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా అవసరాలే పథకాలుగా అందిస్తున్న ఏకైక రాష్ట్రం

నవ తెలంగాణ – సిద్దిపేట



ప్రజా అవసరాలే పథకాలుగా రూపొందించి అమలు పరుస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దివ్యాంగులకు సేవ చేస్తే దైవ సేవతో సమానమని, ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘ నాయకులంతా దివ్యాంగులకు తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. శివమ్స్ గార్డెన్ లో గురువారం మంత్రి సొంత డబ్బులతో 450 మంది దివ్యాంగులకు ఉచిత బస్సు పాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా మంది వికలాంగులు బస్సు పాసుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడుతున్నారని, అందరికీ ఒకే చోట అందించాలని ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఇప్పటికీ బస్సు పాసు రాని వికలాంగులు ఎవరైనా ఉంటే వారి వివరాలను క్యాంపు కార్యాలయంలో అందించేలా నియోజకవర్గ పరిధిలోని గ్రామ సర్పంచులు, వికలాంగుల సంఘ నాయకులు చొరవ చూపాలని కోరారు. బస్సు పాసులకు కావాల్సిన అన్నీ ఖర్చులు తానే భరించి ఉచితంగా పాసులు అందిస్తానని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో వికలాంగులు ఎప్పుడు కూడా ధర్నాలు చేయలేదని, దరఖాస్తులు పెట్టలేదని, అయినా నెలకు రూ.4016 పెన్షన్ ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్నారని అన్నారు. దేశంలోనే అత్యధిక పింఛన్లు తెలంగాణ రాష్ట్రంలో వికలాంగులకు ఇస్తున్నట్లు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో రూ.1000 కూడా మించి ఇవ్వడం లేదని, బీజేపీ పాలిత రాష్ట్రాలలో రూ.600 దాటడం లేదని అన్నారు. సిద్దిపేటలో అన్నీ సౌకర్యాలతో వికలాంగుల సంక్షేమ భవనం నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నామని, దివ్యాంగులను బీఆర్ఎస్ ప్రభుత్వం కడుపులో పెట్టుకుని చూస్తున్నదని చెప్పేలా దివ్యాంగులకు అందిస్తున్న సంక్షేమ పథకాలే నిదర్శనమని అన్నారు.

జోగిపేటలో పట్టపగలు దొంగతనం

నవతెలంగాణ జోగిపేట

జోగిపేట పట్టణంలో పట్టపగలు దొంగతనం జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగుల కొట్టి బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని బెల్లంగౌని ఏరియాలో నివాసముంటున్న ఎర్రగోళ్ల శ్యాం కుమార్ తన తల్లితో కలిసి మంగళవారం 12 గంటల సమయంలో పుల్కల్ మండలానికి పని నిమిత్తం వెళ్లాడు. అతని భార్య అనుష కూడా వ్యవసాయ పనులకు వెళ్లింది. ఇదే అదునుగా చూసిన గుర్తుతెలియని దుండగులు తాళాలు పగల కొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. పక్కనే ఉన్న బీరువా తాళాలు తీసుకొని అందులో ఉన్న ఆరు తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఉండడంతో దొంగతనం జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. ఇంటి చుట్టుపక్కల ముగ్గురు మహిళలు, ఒక వ్యక్తి చిత్త కాగితాలు ఏరుకుంటూ సంచరించినట్లు ఆ ఏరియాలో అమర్చిన సిసి పుటేజీలో కనిపించినట్లు బాధితుడు తెలిపారు. వాళ్లే ఈ పని చేసినట్లు బాధితుడు అనుమానం వ్యక్తం చేస్తున్నాడు. దొంగతనం విషయాన్ని బుధవారం జోగిపేట పోలీస్ స్టేషన్లో బాధితుడు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్‌రూరల్(మనోహరాబాద్)

రాష్ట్రంలో 73 షెడ్యూలు ఎంప్లాయిమెంట్స్‌లో పని చేస్తున్న కార్మికులకు గత 15 ఏళ్లుగా కనీస వేతనాలు సవరించకుండా పాలకవర్గాలు చలగాటం ఆడుతున్నాయని, వేతనాల జీవోలను సవరించి కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏ.మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 4 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్న జీపుజాత పోస్టర్ను బుధవారం తూప్రాన్‌లోని శివసాయి ఫంక్షన్ హాల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఐదేండ్లకు ఒకసారి పెరిగిన ధరలకు అనుగుణంగా చట్టబద్ధంగా ప్రభుత్వ వేతనాలు సవరించాలన్నారు. 2014లో కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత నేటి వరకు టీఆర్ఎస్ ప్రభుత్వం వేతనాలు సవరించలేదన్నారు. కనీస వేతనాల పెంపుదల కోసం కార్మిక చట్టాల అమలు కోసం 10 ఏళ్లుగా వివిధ రూపాల్లో సీఐటీయూ పోరాటాలు చేస్తోందన్నారు. అనేక పరిశ్రమల కార్మికులతో 12 గంటల పని చేయించుకొని శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు డిమాండ్ చేస్తూ చేపట్టిన జీపుజాత ఈ నెల 9వ తేదీన మనోరాబాద్ మండలంలోని కాళ్లకల్‌కు వస్తుందన్నారు. జీపుజాతలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ. మల్లేష్ , టి ఎస్ యు ఈ ఈ యు సిఐటియు జిల్లా అధ్యక్షులు యం. నర్స0లు.సుగుణ యూనియన్ కార్యదర్శి యాదగిరి, కోశాధికారి వై, కుమార్,ఇండస్ పరిశ్రమ కార్యదర్శి బాలేష్ పాల్గొన్నారు.



నవతెలంగాణ – చేగుంట

ప్రైవేట్ పరిశ్రమల్లో కనీస వేతనాలు, జీఓలు సవరించాలని జరిగే జీపుయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఏ.మల్లేశం డిమాండ్ చేశారు. చేగుంట మండల కేంద్రంలో బుధవారం కార్మికులతో కలిసి జీపుజాత పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ పారిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 4వ తేదీన ప్రారంభమైన యాత్ర 9వ తేదీన చేగుంట మండలానికి చేరుకుంటుందన్నారు.



అత్యధిక పరిశ్రమల్లో ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనాలు అమలు కావడం లేదని విమర్శించారు. ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్ లాంటి చట్టపరమైన సౌకర్యాలు ఇవ్వడం లేదన్నారు. హక్కులను అడిగితే కార్మికులను విధుల నుండి తొలగించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు కార్మికులకు రక్షణ ఉండడం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా మరో ఉపాధ్యక్షులు కే.నాగేందర్‌రెడ్డి, నాయకులు రామస్వామి, గణేష్‌రెడ్డి, సతీష్, భాస్కర్, శ్రీనివాస్, శేఖర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ వలయంలో గజ్వేల్



రెండోరోజూ బంద్ పాక్షికం

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్‌లో సోమవారం రాత్రి జరిగిన సున్నితమైన సంఘటన చినికిచినికి గాలి వానలా మారింది. ఒక వర్గం చెందిన వ్యక్తి విప్లవ వీరుని విగ్రహం వద్ద మూత్ర విసర్జన సంఘటన ఉమ్మడి మెదక్ జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించింది. సిరిసిల్ల ఐజి రమేష్ నాయుడు, సిద్దిపేట జిల్లా సిపి శ్వేత ఆధ్వర్యంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో శాంతి నెలకొనడానికి చర్యలు తీసుకున్నారు. ఇరు వర్గాలపై కేసు నమోదుతో పాటు ప్రత్యేక నిఘా విభాగం గజ్వేల్ రింగ్ రోడ్ చుట్టూ చెక్పోస్టులు ఏర్పాటు చేశారు. ఇరువర్గాల దేవస్థానాలు, ప్రార్థనా మందిరాల వద్ద ప్రత్యేక పోలీస్ బలగాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు లేకుండా సిద్దిపేట సిపి శ్వేత, గజ్వేల్ ఏసిపి రమేష్ బాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. 1996 తర్వాత గజ్వేల్ పట్టణంలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం పట్టణ ప్రజలను కలిసివేసింది. అడిషనల్ డీసీపీలు ఇద్దరు, డీఎస్పీలు, ఏసీపీలు పదిమంది, సిఐలు, ఆర్ఐలు మొత్తం 25 మంది, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు 52 మంది బందోబస్తు నిర్వహిస్తున్నారు. గజ్వేల్ పట్టణంలో 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు ప్రతి బుధవారం జరిగే సంతను సంగపురం రోడ్డులో ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ అమల్లో ఉన్నందున ప్రజలు, వ్యాపారులు సహకరించాలని పోలీసు వర్గాలు విజ్ఞప్తి చేశాయి. రెండో రోజు వ్యాపారులు పోలీస్ వర్గాల సూచనలకు అక్కడక్కడా దుకాణాలు తీసే తప్ప పాక్షికంగా పట్టణం బంద్ పాటించారు. ఇంద్ర పార్క్ రోడ్లో, ముత్రాజ్ పల్లి, కోట మైసమ్మ దేవాలయం వద్ద, సంగపూర్ వద్ద, గజ్వేల్ నుండి సిద్దిపేటకు వెళ్లే రోడ్డులో బందోబస్తు ఏర్పాటు చేశారు. జాలిగామ ఎక్స్ రోడ్లో తో పాటు పరిచోట్ల భారీ తనిఖీలు వాహనదారులను చేస్తున్నారు. తనిఖీ చేసిన తర్వాతనే పట్టణానికి అనుమతిస్తున్నారు. పట్టణ ప్రశాంతతకు అందరు సహకరించాలని మున్సిపల్ పాలకవర్గం ఇప్పటికే విజ్ఞప్తి చేసింది. రెండో రోజు కూడా గజ్వేల్ పట్టణానికి వచ్చే రోడ్లన్నీ ఖాళీ రోడ్లుగా కనిపిస్తున్నాయి.

గ్రామ పంచాయతీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు

నవతెలంగాణ-సంగారెడ్డి

'గ్రామపంచాయతీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి. కరోబార్ బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలి. నేటి నుండి జరిగే రాష్ట్ర వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి' అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు పిలుపునిచ్చారు. బుధవారం సంగారెడ్డిలోని సీఐటీయూ ఆఫీసులో గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, కారోబర్ బిల్ కలెక్టర్ లకు సహాయ కార్యదర్శులు గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తదితర డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి గత నెల రోజుల నుండి వినతి పత్రం ఇచ్చినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో తమ హక్కుల కోసం రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ సిబ్బంది ఎంపీడీవో ఆఫీస్‌ల ఎదుట సమ్మెలోకి వెళ్తున్నారని, సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. గ్రామ పంచాయతీ సిబ్బంది కష్టపడి పని చేస్తున్నా గ్రామాలను అద్దంలా తయారుచేసి ప్రభుత్వానికి అవార్డులు తేస్తున్నా కనీస వేతనం దిక్కు లేదన్నారు. చట్టపరమైన సౌకర్యాలు ఏమీ అమలు కావడం లేదన్నారు. కనీస వేతనం చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని, నేటి నుండి జరిగే రాష్ట్ర సమ్మెను జిల్లాలో జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు వెంకటయ్య, నగేష్, దశరథ్, అశోక్, సత్తయ్య, షబ్బీర్, చారి, రామకృష్ణ పాల్గొన్నారు.



పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్

పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని జరుగుతున్న పోరాటాలకు ప్రభుత్వం స్పందించకపోవడంతో జూలై 6వ తేదీ నుండి నిరవధిక సమ్మె దిగనున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి గోపాలస్వామి తెలిపారు. సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ సిబ్బందిని పట్టించుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. జీవో ప్రకారం వేతనాలను పెంచాలని ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ, మహేష్, చొప్పరి రవికుమార్ ,నాయకులు రాజనర్సు, యాదగిరి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.




నేటి నుంచి రాష్ట్ర వ్యాప్త గ్రామ పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె

నవతెలంగాణ దుబ్బాక రూరల్

గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ ఈ నెల 6వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నామని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.భాస్కర్ అన్నారు. ఈ మేరకు దుబ్బాక ఎంపిడివో భాస్కర శర్మ కి గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి సీఐటీయూ జిల్లా కోశాధికారి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.భాస్కర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులు, స్వీపర్లు, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్స్ తదితర కేటగిరిలలో నర్సరీలు, వైకుంఠదామం, పార్కులు, ఆఫీస్ నిర్వహణలో విధులు నిర్వహిస్తున్నా వారందరూ గత 20-30 సంవత్సరాలుగా పనులు చేస్తున్నప్పటికీ పంచాయతీ సిబ్బంది పర్మినెంట్, పనికి గుర్తింపు, పని భద్రత, కనీస వేతనాలు, పి.ఎఫ్. ఇ.ఎస్.ఐ. ప్రమాద బీమా లాంటి



ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని విమర్శించారు.గ్రామ పంచాయతీ సిబ్బందినందరిని పర్మినెంట్ చేయాలని,పి.ఆర్.సిలో నిర్ణయించిన బేసిక్ ప్రకారం పంచాయతీ సిబ్బందికి రూ. 19,000/-లు చెల్లించాలని,ఆ లోపు జీ.వో. నెం.60లో పేర్కొన్న వేతనాలను కేటాగిరీల వారీగా పంచాయితీ సిబ్బందికి నెలకు రూ. 15,600/-లు కారోబార్, బిల్ కలెక్టర్లకు, ఇతర స్కిల్డ్ సిబ్బందికి రూ. 19,500/-లు చెల్లించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు, అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా ప్రమేషన్ ఇవ్వాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి పాత పద్దతిలోనే వివిధ కేటగిరీలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ,కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఈ సమ్మె కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ దుబ్బాక టౌన్ కన్వీనర్ కొంపల్లి భాస్కర్, గ్రామ పంచాయతీ కార్మికులు శ్రీనివాస్, రవి, ప్రశాంత్, కనకయ్య, చెంద్రయ్య, రాజయ్య, ఎల్లయ్య, పెంటయ్య, లచ్చవ్వ, యాదవ్వ, దుర్గవ్వ తదితరులు పాల్గొన్నారు.



పంట రుణాలు రెన్యూవల్‌ను పెన్షన్లకు ముడి పెట్టొద్దు

- సీపీఐ(ఎం) నాయకులు పి.అశోక్



నవతెలంగాణ-సంగారెడ్డి

పంట రుణాలకు రైతు బంధు ఆసరా పెన్షన్లకు ముడి పెట్టవద్దని సీపీఐ(ఎం) నాయకులు పి.అశోక్ అన్నారు. బుధవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో డిఆర్‌ఓ మెంచు నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పి.అశోక్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న రైతు బంధు, ఆసరా పెన్షన్లు పంట రుణం పేరుతో బ్యాంకులు ఇవ్వడం లేదన్నారు. పంట రుణంతో సంబంధం లేకుండా రైతు బంధు, ఆసరా పెన్షన్ డబ్బులు లబ్దిదారులు తీసుకునేలా బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమం లో సీపీఎం నాయకులు నిరుడి శ్రీనివాస్, శేఖర్ లు పాల్గొన్నారు.

వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి





నవతెలంగాణ-ఝరాసంగం

ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కుప్పానగర్ గ్రామ శివారులో బుధవారం జరిగింది. ఎస్ఐ రాజేంద్ర రెడ్డి కథనం ప్రకారం... జహీరాబాద్ పట్టణానికి చెందిన ఎండీ హైమాద్ (36) ఝరాసంగం మండల పరిధిలోని జొనెగాం గ్రామానికి పని నిమిత్తం ఇంట్లో నుంచి గత నాలుగు రోజుల క్రితం బయలుదేరాడు. పనికి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. బుధవారం కుప్పానగర్ గ్రామ శివారులోని రోడ్డు పక్కన ద్విచక్ర వాహనం దగ్గర వ్యక్తి మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించి మృతుడు హైమాద్‌గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతుడికి తమ్ముడు అస్లాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కనీస వేతనాల కోసం పోరాటం

- పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచాలి
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి



నవతెలంగాణ-సంగారెడ్డి

పెరిగిన ధరలకు అనుకూలంగా కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, కనీస వేతనాల కోసం పోరాటానికి సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం యాదగిరి పిలుపునిచ్చారు. బుధవారం పరిశ్రమల పనిచేస్తున్న కాంట్రాక్టుల కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహకార దర్శి యాదగిరి మాట్లాడుతూ 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ లో పనిచేస్తున్న కార్మికుల గత 15 సంవత్సరాలుగా కనీత వేతనాలు సవరించడం లేదు అని అన్నారు. పారిశ్రామిక రంగంలో కార్మికుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది ప్రతి పరిశ్రమలో కాంటాక్ట్ కార్మికులకు నూటికి 90 శాతం కార్మికులుగా పనిచేస్తున్నారు అని అన్నారు. భారీ పరిశ్రమలోని స్కిల్లు వర్కర్ గా చేస్తున్న వాళ్లకు మాత్రం ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా దారుణం అని అన్నారు. ఉత్పత్తిలో శాశ్వత కార్మికులతో సమానంగా పనిచేస్తూ కార్మికులను శ్రమను దోచుకుంటున్నారని అన్నారు. 2001 జూన్ లో 5 రంగాలకు కనీస వేతనము 18 వేల రూపాయలు నిర్ణయించి ఉన్నత అధికారులు ఇచ్చిన ఫైనల్ నోటిఫికేషన్ కూడా యాజమాన్యాల ఒత్తిడికి లొంగి గజిట్ చేయకుండా ముఖ్యమంత్రి కార్యాలయం అడ్డుకుంటుందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికి మూడుసార్లు కనీస వేతనాల సలమండలి ఏర్పాటు చేసింది మండలి చేసిన సిఫారసులను అమలు చేయకుండా తొక్కి పెట్టింది అన్నారు. బీ ఆర్ఎస్ ప్రభుత్వం కమిటీల పేరు మీద కాలయాపన చేస్తున్నది తప్ప కార్మికుల న్యాయం చేయడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాంట్రాక్ కార్మికులకు పెరిగిన ధరలకు అనుకూలంగా కనీస వేతనాలు పెంచాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జరీనా, ఎల్లయ్య, మల్లమ్మ, నర్సింలు, మల్లేశం, విజయ, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి మెదక్ జిల్లా బీసీల రాజకీయ రౌండ్ టేబుల్ సమావేశం



నవతెలంగాణ-కంది

కంది గ్రామ శివారులో గల ఎస్ఎస్‌గార్డెన్ లో బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లా బీసీల రాజకీయ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా అన్ని పార్టీలకు చెందిన బీసీ సంఘాలు పాల్గొన్నాయి. ఈ సంగర్భగా ఆయా పార్టీల నాయకులు పటాన్ చేరు నందీశ్వర్ గౌడ్, పులిమామిడి రాజు, మురళి యాదవ్, కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఒక ఎంపీ స్థానాన్ని, నాలుగు ఎమ్మెల్యే స్థానాలలో పోటీ చేయాలని, ఏ పార్టీ ఐనా బీసీలకు బీ ఫారం యివ్వాలని డిమాండ్ చేద్దామన్నారు. ఎన్నికలకు సమయం కేవలం 120 రోజులు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా బి సి సంగాల అధ్యక్షులు,విద్యార్థి నాయకులూ పాల్గొన్నారు.

ఈటెల రాజేందర్‌కు శుభాకాంక్షలు



నవతెలంగాణ-సదాశివ పేట

బిజెపి రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్‌గా నియమితులైన హుజురాబాద్ శాసనసభ్యుడు ఈటల రాజేందర్‌ను బిజెపి రాష్ట్ర నాయకుడు నెమలికొండ వేణుమాధవ్ ఘనంగా సన్మానించారు. బుధవారం ఉదయం షామీర్‌పేట్‌లోని ఆయన నివాసంలో బిజెపి కార్యకర్తలతో కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకుడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, కొండాపూర్ జగన్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఈజీఎస్ సిబ్బంది



నవతెలంగాణ-వట్ పల్లి

మండల కేంద్రంలో జాతీయ మహాత్మా గాంధీ ఉపాధి పథకం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యాంగ వచ్చిపోతుంటారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బుధవారం ఉదయం 11 దాటిన కార్యాలయానికి ఒక కంప్యూటర్ ఆపరేటర్ తప్ప మిగతా సిబ్బంది ఎవరు కూడా కార్యాలయానికి రాకపోవడంతో ఖాళీ కుర్చీలే వచ్చిపోయేవారికి దర్శనమిచ్చాయి. ఈజీఎస్ ఏపీవో కూడా విధులకు హాజరు కాకపోవడంతో అప్పుడే వచ్చిన కంప్యూటర్ ఆపరేటర్ సాయికి ఏపీఓ ఎక్కడ వెళ్లారని అడగగా ఫీల్డ్ విజిట్ బిజిలిపూర్ నుండి వస్తున్నారని తెలిపారు. అదే గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులకు అడగడంతో మా గ్రామంలో ఎలాంటి విజిట్ లేదని, ఏపీవో రాలేదని తెలిపారు. ఏపీవో విధులు సక్రమంగా నిర్వహించకుండా సమయానికి కార్యాలయానికి చేరుకోలేకపోయినా కార్యాలయ సిబ్బంది ఒకరినొకరు వెనకేసుకొస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీధులకు వచ్చినా రాకపోయినా సిబ్బంది వ్యవహార శైలి విధులకు సమయానికి రాని సిబ్బందిని తప్పించడానికి కార్యాలయానికి వివిధ పనులపై వచ్చిన వారికి తప్పుడు సమాచారం ఇస్తూ కాలం వెళ్లబుచుతున్నారు. ఈజీఎస్ కార్యాలయ సిబ్బంది ఆడింది ఆట.. పాడింది పాటగా తయారైంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఐఐటీ బాంబేలో సీటు సాధించిన ఆంథోనీస్ కళాశాల విద్యార్థిని



నవతెలంగాణ-సంగారెడ్డి

ఇటీవల నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్ష ఫలితాలలో సెయింట్ ఆంథోనీస్ కళాశాలకు చెందిన విద్యార్థిని కె.అద్విక ఆల్ ఇండియా 344 వ ర్యాంకు సాధించి ఐఐటీ బాంబే ఇనిసిట్యూట్‌లో సీటు సాధించి కళాశాలకు కీర్తిప్రతిష్ఠలు తీసుకురావడం ఎంతో గర్వకారణమని సెయింట్ ఆంథోనీకి విద్యా సంస్థల అధినేత సాల్మన్ రెడ్డి అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి విద్యార్థినికి మెమెంటో అందించి సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

అర్హులైన నిరుపేద కుటుంబాలకు దళిత బంధు ఇవ్వాలి



నవతెలంగాణ-కంది

దళిత బంధులో అర్హులైన పేద దళితులందరికీ అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కులవక్ష వ్యతిరేక పోరాట సంఘం(కెవిపిఎస్) కంది మండల ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా కెవిపిఎస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి.అశోక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండో దఫగా ప్రతి నియోజకవర్గానికి 1100 మంది లబ్ధిదారులను గుర్తించి దళిత బందును ఇస్తామని ప్రకటించినందున అర్హులైన పేద దళిత కుటుంబాలను గుర్తించాలని మొదటి ప్రాధాన్యతగా వారికి అవకాశం కల్పించాలన్నారు. ఎంపిక ప్రక్రియలో రాజకీయ జోక్యం లేకుండా పారదర్శకంగా ఉండేందుకు అర్హులైన వారందరి దరఖాస్తులు స్వీకరించి అర్హులైన వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కెవిపిఎస్ కంది మండల కార్యదర్శి , రైతు సంగం మండల కార్యదర్శి ఎన్ శ్రీనివాస్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శేఖర్ లు పాల్గొన్నారు.

పొజిషన్లో ఉన్నవారికి పట్టాలు ఇవ్వాలి

- సీపీఐ పట్టణ కార్యదర్శి పి వినోద



నవతెలంగాణ- సదాశివపేట

సదాశివపేటలో అనేక సంవత్సరాలు నుండి పూరి గుడిసెలు వేసుకొని ఉంటున్న పేదలకు పొజిషన్ పట్టాలు మంజూరు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పి. వినోద డిమాండ్ చేశారు బుధవారం ఉదయం 11 గంటలకు పూరి గుడిసెల ప్రజలతో సమాసమై వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో ఆ కాలనీలో వర్షాలకు మురికి చేరి అంతుపట్టని రోగాలు సోకుతున్నాయని తెలిపారు. పేదలకు పట్టాలు లేని కారణంగా మున్సిపల్ అధికారులు అటు వైపు రావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసినప్పటికీ ఈ తొమ్మిది ఏళ్లకాలంలో పట్టాలు ఎక్కడ కూడా మంజూరు చేయలేదన్నారు. మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పూరి గుడిసెవాసులకు పొజిషన్ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రిహానా బేగం. బిపాషా రాజమ్మ వాహి దాబేగం. నిర్మల భాయ్ దేవి. ముస్తఫా. యాకుబ్ పోచయ్య బాలమణి సుప్రియ పాల్గొన్నారు.

పోడు భూముల పట్టాల పంపిణీ వాయిదా

నవతెలంగాణ-వట్ పల్లి

మండలంలోని ఐదు గిరిజన తండాలకు 53 ఎకరాల 16 గుంటల భూమి 145 మంది లబ్ధిదారులకు పోడు భూముల పట్టాల పంపిణీ అనివార్య కారణాల వల్ల ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు వాయిదా వేయడం జరిగినట్లు డిప్యూటీ తహసీల్దార్ శంబిరెడ్డి తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వెలువడిన తరువాత పంపిణీ చేస్తామని తెలిపారు.

మండలంలో భారీ వర్షం







నవతెలంగాణ-వట్ పల్లి

మండలంలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి రోడ్లు తెగిపోయాయి. పత్తి మొలకలు నీట మునిగాయి. జూన్ మొదటి వారం నుండి వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ అడపాదడపా చినుకులు తప్ప పెద్దగా వర్షాలు కురియలేదు. జూన్ మొదటి వారంలో పత్తి విత్తనాలను విత్తడానికి కూడా చినుకుల జాడ లేకపోవడంతో పొడి మట్టిలోనే విత్తనాలను విత్తిన రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. వారం పది రోజుల క్రితం నుండి అడపాదడపా చినుకులు పడటంతో రైతుల ఆశలు కొంత చిగురించడం ప్రారంభించాయి. విత్తనాలు మొలకెత్తి చిగురిస్తున్న సమయంలో ఎండాకాలాన్ని మించిన ఎండలు దంచి కొట్టడంతో ఉక్కపోతతో పత్తి మొలకలు వాడి పోవడం చూస్తుంటే రైతుల కళ్లలో కన్నీళ్లు తిరిగాయి. మంగళవారం అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు ఏకధాటిగా పెద్ద ఎత్తున వర్షం కురవడంతో వాగులు వంకలు పొర్లాయి. రోడ్లు తెగిపోయి దిగువన ఉన్న ప్రాంతాలు నీట మునిగాయి. తెల్లారేసరికి భారీగా కురిసిన వర్షానికి రైతుల ఆశలు చిగురించడంతో ఆనందానికి అంతులేకుండా పోయింది. ఆయా గ్రామాలలో లోతట్టు ప్రాంతాలలో వేసిన పత్తి మొలకలు నీట మునిగాయి. మర్వెళ్లి బిజిలి పూర్ మధ్యలో వరద తాకిడి రోడ్డు తెగిపోయింది.

ఉచిత వైద్య శిబిరానికి అపూర్వస్పందన



నవతెలంగాణ-కంగ్టి

మండలకేంద్రమైన కంగ్టిలో బుధవారం విగ్రాహం రామాగౌడ్ పీపుల్స్ ట్రస్ట్ చైర్మెన్ విగ్రాహం శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి చుట్టుపక్కల గ్రామాలనుండి అనేకమంది తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. స్వర్గీయ విగ్రాహం రామాగౌడ్ పేదలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు.

జిన్నారం ఉర్సు ఉత్సవాలకు నీలం మధు విరాళం



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో ఈనెల 6 నుంచి ప్రారంభం కానున్న జిన్నారం హజ్రత్ గరీబ్ షా వలీ దర్గా ఉత్సవాలకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ లక్ష రూపాయల విరాళం అందించారు. ఈ మేరకు సదరు ఆర్థికసాయాన్ని స్థానిక జిన్నారం ఎస్.ఎం.ఆర్ బృందం దర్గా కమిటీ సభ్యుల బృందానికి అందజేశారు. ఈ మేరకు నిర్వాహకులు నీలం మధు ముదిరాజు కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్,బాలు, నీలం సత్యనారాయణ,ఎండి సాజిత్,ఎండి సిద్దిక్,దర్గా కమిటీ ప్రతినిధులు అబ్దుల్ హక్ హుస్సేన్, జబ్బర్,పుట్టి సురేష్,ఎండి సలావుద్దీన్, వినోద్, కృష్ణ, ఎండి ముర్తుజా, బిక్షపతి,నీలం రాము, పుట్టి వెంకటేష్, లక్ష్మణ్ తదితర నేతలు ఎస్ఎంఆర్ శ్రేణులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి ఢిల్లీ వసంత్

- 10న మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక



నవతెలంగాణ-జహీరాబాద్

రాష్ట్ర సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితుడనై బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు నిర్ణయించుకున్నట్లు సామాజిక ఉద్యమకారుడు ఢిల్లీ వసంత్ తెలిపారు బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన మంత్రి హరీష్ రావు సమక్షంలో తమ అనుచరులతో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. తనకు సంబంధించిన ఒక్కొక్కర పొలంలో టిఆర్ఎస్ పార్టీ కార్యక్రమాల కోసం కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అసెంబ్లీకి బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టడం ఎంతో హర్షించదగ్గ విషయమని అన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి ఆయన చేస్తున్నటువంటి కృషి తమలో చలనం తీసుకువచ్చిందని అన్నారు. ఈ సమావేశం లో మాధవ్ రెడ్డి,జనార్దన్, అశోక్ పాటిల్, మహిపల్ తదితరులు ఉన్నారు.

బిజెపి రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్‌ను కలిసిన రాజేశ్వరరావు దేశ్ పాండే



నవతెలంగాణ-సంగారెడ్డి

బిజెపి రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్‌గా నియమితులైన హుజురాబాద్ శాసనసభ్యుడు ఈటల రాజేందర్‌ను మర్యాదపూర్వకంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వరరావు దేశ్పాండే కలిసి ఘనంగా సన్మానించారు. బుధవారం ఉదయం షామీర్ పెట్ లోని ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు వెంకట నరసింహారెడ్డి, మందుల నాగరాజ్, దోమల విజయకుమార్, రాకేష్ గౌడ్, భాను తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువులకు పేద విద్యార్థినికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన కళ్లెంల సమ్మయ్య కుమార్తె ఉన్నత చదువుల కోసం సంగారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆత్మకూర్ నాగేష్ ఫౌండేషన్ చైర్మన్ ఆత్మకూరు నాగేష్ బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆర్థిక సహాయం చేశారు. హైదరాబాదులోని సెంట్ మేరీస్ ఇంజనీరింగ్ కాలేజీలో రెండవ సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న సమ్మయ్య కూతురుకు వసతి సౌకర్యాల నిమిత్తం ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ నాగేష్ మాట్లాడుతూ సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలో ఎవరైనా పేద విద్యార్థులు ఉంటే సేవ చేయడానికి తమ వంతుగా ఎప్పుడు ముందుగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల బిఆర్ ఎస్ నాయకులు ఫౌండేషన్ సభ్యులు శ్రీకర్ రెడ్డి, పట్నం మురళి, బక్కప్ప, సాయి, నరేష్ పాల్గొన్నారు.

ఫసల్‌వాదిలో న్యాయ అవగాహన సదస్సు



నవతెలంగాణ-సంగారెడ్డి

జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ హైద్రాబాద్ వారి ఆదేశాల ప్రకారం, జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ యస్. శశిధర్ రెడ్డి సూచనలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జె. హన్మంత రావు సంగారెడ్డి మండలం ఫసల్‌వాది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్జి హనుమంతరావు మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకోవాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పిల్లలకు పెడుతున్న భోజనం తిని పరిశీలించారు. పాఠశాల మొత్తం కలయ తిరిగి శౌచాలయాలు, వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. పిల్లలతో కుర్చీలు వేయిస్తుండటం చూసి ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా విద్యాధికారికి ఫోన్ చేసి మాట్లాడారు. ఇంచార్జ్ హెడ్ మాస్టర్ చంద్రయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలకు ఎంపీపీ రవీందర్ గౌడ్ సాయం



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల కేంద్రంలో గరీబ్ షావలి దర్గా వద్ద అంగరంగ వైభవంగా నిర్వహించే దర్గా ఉర్సు ఉత్సవ కార్యక్రమానికి జిన్నారం మండల పరిషత్ అధ్యక్షులు దమ్మగౌండి రవీందర్ గౌడ్ మంగళవారం ఉర్సు ఉత్సవ కమిటీ ప్రతినిధులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అబ్దుల్ ఎండీ షఫీ, పల్నాటి భాస్కర్,విష్ణుమూర్తి, వడ్ల నరేష్, గుర్రాల అనంతగిరి యాదవ్, యనగండ్ల నరేందర్ గౌడ్ పలువురు మైనార్టీ సోదరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల చించివేతపై పోలీసులకు ఫిర్యాదు



నవతెలంగాణ-జిన్నారం

మండల కేంద్రమైన జిన్నారంలో ఎస్ ఎం ఆర్ శ్రేణులు వేసిన ఫ్లెక్సీలను చించి వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ జిన్నారం మాజీ ఎంపీటీసీ నీల మధు ముదిరాజ్ యువసేన బృందం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి పుట్టి భాస్కర్ మాట్లాడుతూ జిన్నారం అంబేడ్కర్ చౌరస్తా, బస్ స్టాప్ సెంటర్లో హజరత్ గరీబ్ షా వలీ దర్గా ఉత్సవాలకు తొలి ఏకాదశి, బక్రీద్ , పర్వదినాల నేపథ్యంలో వేసిన ఫ్లెక్సీలు చింపివేశారన్నారు. ఈ అంశంపై జిన్నారం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిన్నారం మాజీ ఎంపీటీసీ ఎంఎంఆర్ నేత పుట్టి భాస్కర్, తోర్రి వినోద్,నాగారం యాదగిరి, భాస్కర్, కంది ప్రవీణ్, ఎ ద్రవాలిరవి, ఎండి సాజిత్, ఎండి ముర్తుజ, పుట్టి సురేష్, ఎండి వహెద్, కృష్ణ, బిక్షపతి, నీలం రాము, సాయిరెడ్డి, వి.సుదర్శన్ ఎస్ఎంఆర్ శ్రేణులు పాల్గొన్నారు.

బోనాల వేడుకల్లో పాల్గొన్న కౌన్సిలర్ చంద్రారెడ్డి



నవతెలంగాణ-ఐడిఏ బొల్లారం

బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని జ్యోతి నగర్ లో బుధవారం సాయంత్రం బోనాల పండుగను కాలనీవాసులు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు బీ.ఆర్.ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకొని డప్పువాయిద్యాల మధ్య ఊరేగించారు. గ్రామదేవతలకు బోనాలు, నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో పాల్గొన్న కౌన్సిలర్ చంద్రారెడ్డిని స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సీతామహాలక్ష్మీ, శేఖర్, వాసు, బాలకృష్ణ , వెంకటేష్, సురేష్ గారు, సింహాచలం గారు, సంతోష్ గారు, జయరాం, ఢిల్లీ, సాయి, చందు, కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



నేటి నుంచి గ్రామ పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె

సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ

నవతెలంగాణ-మెదక్



గ్రామపంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె గురువారం నుంచి కొనసాగనుందని సీఐటీయూ జిల్లా కోశాధికారి కె. నర్సమ్మ కోరారు. బుధవారం మెదక్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, జీఓ నెంబర్ 60 ప్రకారం రూ.15600 నుంచి రూ.19,500 పెంచాలని, మల్టీపర్పస్ పని విధానాన్ని రద్దు చేయాలని, గ్రామ పంచాయితీగా సిబ్బందికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. ఇతర సమస్యలను పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లాలో 21 మండలాల్లో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెలో పాల్గొని సమస్యలను పరిష్కారించే వరకు పోరాటం కొనసాగించనున్నట్లు తెలిపారు. ఈ సమ్మె అధికారులకు గ్రామంలో ప్రజలకు వ్యతిరేకం కాదని ప్రభుత్వం మీద తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న పోరాటమని స్పష్టం చేశారు. ఈ సమ్మెకు కార్మికులు అందరూ సహకరించి జయప్రదం చేయాలని కోరారు.

కిష్టాపూర్‌లో ఇంటింటికి మొక్కల పంపిణీ

నవతెలంగాణ-కొల్చారం



కొల్చారం మండలం కిష్టాపూర్ గ్రామంలో స్థానిక సర్పంచ్ తిరునగరి గోదావరి ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోదావరి మాట్లాడారు. నాటిన మొక్కలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని రక్షించుకోవడం అంతే ముఖ్యమన్నారు. వనాలు ఉంటేనే వర్షాలు కురుస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే స్వచ్ఛమైన గాలి కావాలి, స్వచ్ఛమైన గాలి కావాలంటే మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మమత, ఫీల్డ్ అసిస్టెంట్ యాదగిరి, అంగన్వాడీ టీచర్లు శోభ, శ్రీమతమ్మ పాల్గొన్నారు.

మెతుకు సీమకు మణిహారం మెడికల్ కళాశాల

- మెదక్‌కు మెడికల్ కళాశాల మంజూరు
- నెల రోజుల్లో నూతన కలెక్టరేట్, ఎస్పి కార్యాలయాల ప్రారంభోత్సవం
- నెరవేరిన చిరకాల స్వప్నం
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా వాసులు
- సంబరాల్లో బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-మెదక్

దశాబ్దాలుగా ఎంతో వెనుకబాటులో ఉన్న మెదక్ జిల్లా స్వరాష్ట్రంలో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. నూతన జిల్లా కేంద్రంగా ఏర్పడిన తరువాత స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, జిల్లా మంత్రి హరీష్ రావు ప్రత్యేక చొరవతో సంక్షేమ అభివృద్ధిలో మెదక్ ముఖ చిత్రంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇందులో భాగంగానే రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసుకోవడం, రహదారుల విస్తరణ, మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి ఏర్పాటు, నూతన కలెక్టరేట్, ఎస్పి కార్యాలయాలు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉండటంతో పాటు తాజాగా మంజూరైన మెడికల్ కళాశాల మెతుకు సీమకు మణిహారంగా మారనున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలానే లక్ష్యంతో జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. ఒక్కో కళాశాలలో 100 ఎంబిబిఎస్ సీట్లను కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యార్థులకు వైద్య కళాశాల ద్వారా మరింత ప్రయోజనం చేకూరనుంది.

మెదక్ ప్రజల చిరకాల స్వప్నం నెరవేరిన వేళ

మెదక్‌కు మెడికల్ కళాశాలను మంజూరు చేస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. చిరకాల స్వప్నమైన మెడికల్ కళాశాల కోరిక నెరవేరడంతో జిల్లా వాసులు, బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు చేసుకున్నారు. మెదక్ పట్టణంలోని రాందాస్ చౌరస్తాలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రుల హరీశ్ రావు, కేటీఆర్‌ల చిత్రపటాలకు



పాలాభిషేకం చేసి, స్వీట్లు పంచుకొని టపాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు.

పేదలకు చేరువైన వైద్యం

మెదక్‌కు మెడికల్ కళాశాల ఏర్పాటు కావడం చాలా సంతోషకరమైన విషయమని, పేదలకు మరింత వైద్య సేవలు చేసే అవకాశాలు ఉన్నాయని ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. మెదక్ మెడికల్ కళాశాల ఏర్పాటు విషయమై స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం తరువాత అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్య, వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెదక్‌కు మెడికల్ కళాశాల మంజూరు చేయడంతో ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక నేరవేరిందన్నారు. మెడికల్ కళాశాల బాగా నడిచే విధంగా కృషి చేస్తామని తెలిపారు. మెదక్‌లో 100 పడకల ఆసుపత్రితో పాటు నర్సింగ్ కళాశాల మంజూరు కావడం సంతోషకరమన్నారు. మెదక్ జిల్లా కేంద్రంగా ఏర్పాటు



చేసుకోవడంతో పాటు రైల్వే స్టేషన్‌ను, మెడికల్ కళాశాల రావడం హర్షించదగ్గ విషయమన్నారు. పేదలకు మంచి వైద్యాన్ని అందిస్తే ఆర్థిక ఇబ్బందులు లేకుండా పోతాయన్నారు. మరో నెల రోజుల్లో సీఎం చేతుల మీదుగా నూతన కలెక్టరేట్, ఎస్పి కార్యాలయాలు ప్రారంభించుకోబోతున్నట్లు స్పష్టం చేశారు. మెదక్ జిల్లా కేంద్రానికి మెడికల్ కళాశాల మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, ఆర్ కె శ్రీనివాస్, జయరాజ్, కిషోర్, నిజాంపేట్ ఎంపీపీ సిద్దిరాములు, రామాయంపేట, హవేళిఘణపూర్ మండల పార్టీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రాగి అశోక్, లింగారెడ్డి, గడ్డమీద కృష్ణగౌడ్, మధుసూదన్ రావు, దుర్గాప్రసాద్, శివరామకృష్ణ, అరవింద్ గౌడ్, జుబేర్, గోపాలకృష్ణ, శంకర్, సాప సాయిలు, మోహన్, దుర్గయ్య, బాగారెడ్డి, హనుమంత్ రెడ్డి, శ్యామ్, కసాపురం కిరణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీఏసీఎస్ చైర్మన్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

తూప్రాన్ ఉమ్మడి మండలాల పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలక్రిష్ణారెడ్డి జన్మదిన వేడుకలను తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. తూప్రాన్ పీఏసీఎస్ సొసైటీ కార్యాలయం వద్ద సొసైటీ డైరెక్టర్‌లు, నాయకులు కౌన్సిలర్లు భారీ కేకును కట్‌చేసి ఘనంగా నిర్వహించారు. అలాగే మనోహరాబాద్ మండల కేంద్రంలో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రసిడెంట్ చిట్కుల్ మహిపాల్‌రెడ్డి నివాసంలో భారీ కేకును ఏర్పాటు చేసి కట్ చేశారు. జన్మదినం సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్‌కు శాలువాలతో సన్మానాలు చేశారు. అనంతరం దండుపల్లిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులు సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు భారీ ఎత్తున జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో సొసైటీ వైస్ చైర్మన్ కొక్కొండ దీపక్‌రెడ్డి, డైరెక్టర్లు యాదాగౌడ్, తూప్రాన్ మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కావేరిగారి భగవాన్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు రఘుపతి, సత్య నారాయణగౌడ్, చెట్లగౌరారం ఉపసర్పంచ్ శ్రీహరిగౌడ్, నరేన్‌రెడ్డి, కాశీరెడ్డి, పీఏసీఎస్ సిబ్బంది. మహిపాల్‌రెడి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి, ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, నాయకులు రావెల్లి కృష్ణ, దశరథ, సాయిబాబా, రవికుమార్, మల్లి కార్జున్‌గౌడ్, రఘు, నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదివి ఉన్నత వ్యక్తులుగా ఎదగాలి

బీఆర్ఎస్ పార్టీ మండల కోశాధికారి బండారి గంగాధర్

నవ తెలంగాణ-నర్సాపూర్



విద్యార్థులు బాగా చదివి ఉన్నత వ్యక్తులుగా ఎదగాలని శివంపేట మండల బీఆర్ఎస్ పార్టీ కోశాధికారి బండారి గంగాధర్ అన్నారు. శివంపేట మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామ ప్రాథమిక పాఠశాలలో సరిపడు ఉపాధ్యాయులు లేకపోవడంతో బండారి గంగాధర్ తన సొంత డబ్బులతో బుధవారం విద్యా వాలంటీర్‌ను నియమించాడు. ఇందుకు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు బండారి గంగాధర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బండారి గంగాధర్ మాట్లాడుతూ పిల్లుట్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. పాఠశాలకు తన పూర్తి సహకారం అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్ రెడ్డి, రాజు, పిల్లుట్ల విద్యా కమిటీ చైర్మన్ పిల్లి మధు, పెద్దపులి శంకర్, కుమ్మరి నాగరాజు, తదితరులు ఉన్నారు.

రెవెన్యూ డివిజన్ మద్దతుకై తరలిన గిరిజన లంబాడి సోదరులు

నవతెలంగాణ - నిజాంపేట



రామాయంపేట రెవెన్యూ డివిజన్ కొరకై 101 రోజుల రిలే దీక్షలో భాగంగా రెవిన్యూ డివిజన్ మద్దతుకై నిజాంపేట మండల కేంద్రం నుంచి బుధవారం గిరిజన లంబాడి సోదరులు ర్యాలీగా బయలుదేరారు. ఈ సందర్భంగా లంబాడి ఐక్యవేదిక నియోజకవర్గ కోఆర్డినేటర్ సురేష్ నాయక్ మాట్లాడుతూ నిజాంపేట మండల జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజన్‌కై 101 రోజుల దీక్షలు పూర్తి చేసుకున్న సందర్భంగా గిరిజన లంబాడి సోదరుల నృత్య ప్రదర్శన ఆటపాటలతో నిజాంపేట మండలం నుంచి రామాయంపేట రెవెన్యూ డివిజన్‌కు మద్దతుగా ర్యాలీగా బయలుదేరడం జరుగుతుందన్నారు. రామాయంపేటలో భోగ్ బండారి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో పంజా విజయ్ కుమార్ తో పాటు గిరిజన లంబాడి సోదరులు భారీ సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. రామయంపేట రెవెన్యూ డివిజన్ సాధించుకునే వరకు ఈ పోరాటం ఆగదన్నారు. ఈ కార్యక్రమంలో లంబాడి సోదరులు బాల్య నాయక్, పంతులు, గిరిజన మహిళలు తదితరులు పాల్గొన్నారు.

జేసీబీతో మోరీలలో పిచ్చి మొక్కల తొలగింపు

నవతెలంగాణ-నిజాంపేట



నిజాంపేట మండల కేంద్రంలోని మూడో వార్డులో గల దళిత కాలనీలలో మోరీలలో పెరిగిన పిచ్చి మొక్కలను, చెత్తా చెదారాన్ని జేసీబీతో తొలగించారు. అకాల వర్షాలతో మోరీలు పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో పేరుకపోవడంతో, పాములు, తేళ్లు, మురికి నీరు ఇండ్లలోకి చేరుతున్నాయి. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మండల జెడ్పీటిసి పంజా విజయ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి జెసిబి సహాయంతో మోరిలలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. దీంతో మూడవ వార్డు దళిత కాలనీవాసులు జెడ్పీటిసి పంజా విజయ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు గరుగుల శ్రీనివాస్ దళితకాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

చేగుంట ఇన్చార్జి తహసీల్దార్‌గా స్వప్న

నవతెలంగాణ-చేగుంట



చేగుంట మండల కేంద్రం తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా ఇన్చార్జి తహసీల్దార్‌గా స్వప్న బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడే పనిచేసిన తహసీల్దార్ లక్ష్మణ్ బాబు బదిలీపై వేరే మండలానికి వెళ్లడంతో, రామాయంపేట తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న స్వప్న చేగుంట తహసీలార్‌గా బాధ్యతలు తీసుకున్నారు. మండల ఎంపీపీ మాసుల శ్రీనివాస్ నూతన తహసిల్దారు స్వప్న ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానం చేశారు. అలాగే స్థానిక సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్, ఎంపిటిసి అయిత వెంకటలక్ష్మి రఘురాం లు కార్యాలయంలో శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నర్సింగ్ యాదవ్, రాజేష్, సోమ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి

నవతెలంగాణ-సంగారెడ్డి



ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ రవి మాట్లాడుతూ విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ చేస్తూ విద్యార్థులకు చదువుని అమ్ముకుంటూ వారికి చదువుదూరం అయ్యేలా కార్పొరేట్ శక్తులు వ్యవహరిస్తున్నాయన్నారు. విద్యార్థులు వారు చదువుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ పాఠశాలలో, కళాశాలలో ఇష్టం వచ్చిన రీతిలో ఫీజుల దోపిడీ చేస్తున్నారని ట్యూషన్ ఫీజులు పేరిట వేలాది రూపాయలు దండుకుంటున్నారన్నారు.ప్రైవేట్ కార్పొరేట్ అధికంగా ఫీజులు వసూలు చేస్తుంటే అధికార యంత్రాంగం కార్పొరేట్ వ్యక్తులకు కొమ్ము కాస్తున్నారని దుయ్యబట్టారు. ఇకనైనా ప్రభుత్వాధికారులు స్పందించి ఫీజులు కోసం నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని లేకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎర్రోళ్ల మహేష్, నల్లవల్లి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్, జిల్లా సహాయ కార్యదర్శి రాజేష్, రజనీకాంత్, సాక్షి, జిల్లా కమిటీ సభ్యులు రవి వాణి తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్‌లో కొనసాగుతున్న అంటరానితనం

- దశాబ్ది ఉత్సవాలలో సహపంక్తి భోజనాలకు దూరమైన దళితులు
- చర్యలు తీసుకోవాలని పోలీసుస్టేషన్లో ఫిర్యాదు

నవతెలంగాణ జగదేవపూర్

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచినా, ప్రభుత్వాలు ఎన్ని మారినా గ్రామాల్లో నేటికీ అంటరానితనం కొనసాగుతోందని వివక్షకు గురైన గ్రామస్తులు బుధవారం జగదేవపూర్ పోలీస్ స్టేషన్లో, తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కులవివక్ష చూపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పూర్తి వివరాల్లోకి వెళితే జగదేవపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో 288 కుటుంబాలు ఉన్నాయి. అందులో ఎస్సి కులానికి చెందిన వారివి 68 కుటుంబాలు ఉన్నాయి. 350 మంది దళితులకు దేవాలయ ప్రవేశం లేదు. చెట్ల కిందనే క్షవరం చేయించుకోవాలని గ్రామానికి చెందిన కొందరు కుల పెద్దమనుషులు జులుం సాగిస్తూ దళితులపై వివక్షత కొనసాగిస్తున్నారు. 2003 సంవత్సరంలో నాటి దళిత యువకులు గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో ప్రవేశం కావాలంటూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. దేవాలయ ప్రవేశం చేశారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేని కొందరు గ్రామ పెద్దలు దేవాలయానికి తాళం వేశారు. కొన్ని కులాలతో కలిసి దేవాలయంలో హెూమాలు చేశారు. నాటి నుండి నేటి వరకు దేవాలయంలో దళితులకు ప్రవేశం లేదు. ఈ మధ్యనే గ్రామంలోని దళితులకు అందరిలా కాకుండా చెట్ల కింద కూర్చోబెట్టి క్షవరం చేయడం మొదలుపెట్టారు. ఇదేమిటని దళిత యువకులు ప్రశ్నించారు. గ్రామ పెద్దమనుషుల ఆదేశాల మేరకు మీకు క్షవరం చేయడం లేదని మంగలిస్వామి దుకాణం మూసుకుని వెళ్లాడు.

దశాబ్ది ఉత్సవాలలో సహపంక్తి భోజనాలకు దూరం

తెలంగాణ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామంలోని చెరువు గట్టుపై సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. గ్రామంలోని కొందరు పెద్దలు దళిత కుటుంబాలను సహపంక్తి భోజనాలకు రానివ్వకుండా కట్టడి చేశారు.

వివక్ష చూపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

తిమ్మాపూర్‌లోని 68 దళిత కుటుంబాలపై కులవివక్ష చూపుతూ... అంటరానివారుగా అవమానపరుస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు మరాటి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గ్రామంలోని మిగతా కులస్తులకు అవగాహన



కల్పించాలని, దళిత కుటుంబాలకు దేవాలయ ప్రవేశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఎంత చదివినా వెంటాడుతున్న అంటరానితనం

చదువులో రాణించిన సమాజంలో గుర్తింపు పొందినా గ్రామంలోకి వచ్చేసరికి తమ కులం వారికి అంటరానితనం వెంటాడుతూనే ఉందని గ్రామానికి చెందిన పోచంపల్లి స్వామి ఆవేదన వ్యక్తం చేశారు. డిగ్రీ పూర్తి చేసి పట్టా పొందిన ఫలితం లేదన్నారు. పుస్తకాలలో ఉన్న నీతి తమ గ్రామంలో పని చేయడం లేదన్నారు. నాలాగా దళిత కుటుంబాలలో ఎంతో మంది యువకులు డిగ్రీ పట్టాలు పుచ్చుకున్నా గ్రామంలో వివక్షత మాత్రం తగ్గడం లేదన్నారు. నాయకులు అధికారులు గ్రామంలో జరుగుతున్న వివక్షతపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వాన కురిసే... రైతు మురిసే

చేను చెలకల్లో చిగురించిన పత్తి మొలకలు
కలుపు తీతలో బిజీగా గడుపుతున్న కూలీలు

నవతెలంగాణ- కొల్చారం





కొల్చారం మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. గత వారం రోజుల క్రితమే తొలకరి చినుకులు పలకరించడంతో రైతులంతా విత్తనాలు వేశారు. మంగళవారం రాత్రి దాదాపు రెండు గంటల పాటు పడిన వర్షంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేశారు. ఇంతటితో మరో వారం రోజుల పాటు వర్షం పడకుండా ఉంటే పత్తి పంటల్లో కలుపు తీసేందుకు వీలుంటుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క భారీగా కురిసిన వర్షానికి వ్యవసాయ పొలాల్లోని మడికట్లు జలమయమయ్యాయి. నారుమళ్లు ఏత దశకు రాకముందే భారీ వర్షం కురవడంతో ఈ ఏడాది వర్షాలకు కొదువ లేదని రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో పది నుంచి పదిహేను రోజుల వ్యవధిలో వరినాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు రైతులు తెలిపారు. దీంతో మండల వ్యవసాయ అధికారులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి రైతులకు సూచనలు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)



వర్షాకాలం ప్రారంభం కావడంతో గ్రామంలోని ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని సర్పంచ్ రేణుకా అంజనేయులు సూచించారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రేణుకా అధ్యక్షతన కార్యదర్శి సునందాదేవి గ్రామ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. వీధులలో చెత్తను వేయకుండా చెత్త సేకరణకు వచ్చే వాహనంలోనే చెత్తను వేయాలని తెలిపారు. వర్షాకాలం కావడంతో వర్షం నీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నీరు నిలిస్తే దాంతో దోమలు, ఈగలు పెరిగే అవకాశం ఉంటుందని పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలని తెలిపారు. గ్రామంలో ఎప్పటి కప్పుడు దోమల మందు కాని, వీధులలో పిచ్చి మొక్కలు పెరగకుండా మందును పిచికారీ చేయించాలని కార్యదర్శికి సూచించారు. అనంతరం ఇంటింటికి ఐదు రకాల మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి, ఆశా వర్కర్లు, గ్రామ మహిళలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కల్తీ విత్తనాల నిరోధకానికి చర్యలు చేపట్టాలి

వానాకాలం సాగులో అప్రమాతంగా ఉండాలి
రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి
కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ - మెదక్



వానకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కల్తీ విత్తనాల నిరోధకానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. బుధవారం కలెక్టరేట్ లో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, జిల్లా వ్యవసాయ అధికారితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు కావాల్సిన విత్తనాలు ఎరువులను అందుబాటులో ఉండే విధంగా ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉంటూ ప్రణాళిక చేపట్టాలన్నారు. కల్తీ విత్తనాల నిరోధానికి ప్రతి ఎరువులు, విత్తనాల దుకాణాల సముదాయాన్ని నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతుబంధు, రైతుబీమా, పంట లెక్కల వివరాలను నమోదు చేసే విధంగా వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ వివరాలను ఎప్పటికప్పుడు సేకరించాలని తెలిపారు. వరి నాట్లు ప్రారంభమైన నేపథ్యంలో మండల స్థాయిలో సరిపడా ఎరువులను ప్రాథమిక సహకార సంఘాలు, ఆగ్రో రైతు సేవ కేంద్రాలు, ప్రైవేటు ఎరువుల దుకాణాల ద్వారా సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆశాకుమారి, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పెంపుడు కుక్కలకు ఉచిత రేబీస్ టీకాలు

ఏడి జనార్దన్ రావు

నవతెలంగాణ నర్సాపూర్

ప్రపంచ జునోసిస్ దినోత్సవ సందర్భంగా గురువారం నర్సాపూర్ పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచిత రేబీస్ వ్యాధి టీకాలను ఇవ్వడం జరుగుతుందని పశు సంవర్ధక శాఖ ఏడి జనార్దన్ రావు తెలిపారు.జూలై 6న జోనోసిస్ దినోత్సవాన్ని పశువైద్యశాలలో నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. పెంపుడు కుక్కలకు, పెంపుడు పిల్లులకు రేబిస్ టీకాలు వేయడ జరుగుతుందన్నారు. రేబిస్టికాలను ఫ్రెంచ్ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ 1885 జూలై 6న కనుగొన్నాడని తెలిపారు. ప్రతి సంవత్సరం జూలై 6న జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహించుకుంటామన్నారు. పెంపుడు పశువుల నుంచి రేబిస్ ఎబోలా ఫ్లేక్ డెంగ్యూ జపనీస్ ఇన్ సేఫలైటీస్ అనే వ్యాధులు పెంపుడు కుక్కలకు ద్వారా మనుషులకు కూడా వ్యాపిస్తాయన్నారు. రేబిస్ టీకాలు ఇప్పించినట్లయితే మనుషులకు ఈ వ్యాధులు సోకకుండా నివారించబడుతుందని తెలిపారు. పశువులకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పెంపుడు కుక్కల యజమానులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ పెంపుడు పశువులకు రేబిస్ టీకాలు తప్పకుండా ఇప్పించాలని ఆయన సూచించారు.

చిన్నపిల్లల అక్రమ తరలింపుపై అవగాహన

నవతెలంగాణ-కౌడిపల్లి



బాల్య వివాహలపై, చిన్నపిల్లల అక్రమ తరలింపు అంశాలపై విద్యార్థులకు పాఠశాల సిబ్బంది సమక్షంలో కౌడిపల్లి మండలం, భుజరంపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం కైలాష్ సత్యార్థి సెంటర్ ఫర్ యాక్షన్ రీసెర్చ్ పీపుల్స్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్ దుర్గమని ఆధ్వర్యంలో విద్యార్థిలకు అవగాహన కల్పించారు. ఆడపిల్లలపై జరిగే లైంగిక వేధింపులు ఉచిత విద్య నిర్బంధ హక్కు చట్టం బాలల హక్కు గురించి బాల కార్మికుల వ్యవస్థను నిషేధించాలనే అంశాలపై పాఠశాలలో విద్యార్థినులు విద్యార్థులు తల్లిదండ్రులతో అవగాహన కార్యక్రమం చేపట్టారు. సమాజంలో అవగాహన లేకపోవడంతోనే చిన్నపిల్లల అక్రమ తరలింపు బాల్య వివాహాల సంఖ్య రోజురోజుకు పెరుగుతుందన్నారు. చిన్న వయసులో చేయడం వల్ల కలిగే అనర్ధాలు, చిన్నపిల్లల అక్రమ తరలింపు అంశాలపై పిల్లల తల్లిదండ్రులకు చట్టాలు, వాటి నివారణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మహిపోద్దిన్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గురుకులాల్లో పార్ట్ టైం ఉపాధ్యాయుల భర్తీ

- జూలై 10 వరకు గడువు
- జిల్లా అదనపు కలెక్టర్ రమేష్

నవతెలంగాణ-మెదక్

జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పూర్తి తాత్కాలిక పద్ధతిన పార్ట్ టైం ఉపాధ్యాయుల సేవలను 2023-24 విద్యా సంవత్సరానికి వినియోగించుటకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ రమేష్ బుధవారం తెలిపారు. ఈ నెల 10 వరకు దరఖాస్తులను మెదక్ పట్టణంలోని మినీ గురుకులంలో ప్రాంతీయ సమన్వయకర్త కార్యాలయంలో పని దినాలలో సమర్పించాలని సూచించారు. బాలికల పాఠశాలల్లో మహిళలు మాత్రమే అర్హులని తెలిపారు. పీజీ, బీఈడీతో పాటు టెట్ అర్హులన్నారు. బాలికల జూనియర్ కళాశాల విభాగానికి ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, జువాలజీ, సివిక్స్, ఎకానామిక్స్, తెలుగు, ఆంగ్లం, గణితం, పాఠశాల విభాగానికి తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఫిజిక్స్, సాంఘిక శాస్త్రం, పీఈటీ కొరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బాలుర జూనియర్ కళాశాల విభాగానికి తెలుగు, ఇంగ్లీష్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటని, జువాలజీ పోస్టుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నారని వివరించారు. పీజీ, బీఈడీలో సెకండ్ డివిజన్‌లో ఉత్తీర్ణులు అవ్వాలన్నారు. ఉపాధ్యాయుల ఎంపిక పూర్తి పారదర్శకంగా డెమో, మెరిట్ ఆధారంగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన చేయాల్సి ఉంటుందన్నారు.

నెలాఖరులాగా మనఊరు మనబడి పనులు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-మెదక్



మనఊరు మనబడి పనులను ఆయా పాఠశాలల్లో ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. బుధవారం మెదక్ కలెక్టరేట్లోని ఆడిటోరియంలో మెదక్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని సర్పంచులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, మనఊరు మనబడి మండల స్థాయి నోడల్ అధికారులు, మండల విద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనఊరు-మనబడి కార్యక్రమంలో భాగంగా ఎన్ఆర్ఈజిఎస్ పనులను, మంజూరైన పాఠశాలల్లో ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని సర్పంచులను కోరారు. టాయిలెట్స్, కిచెన్‌షెడ్, కంపౌండ్ వాల్స్‌ను త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలని ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాధా కిషన్, పంచాయితీరాజ్ ఈఈ సత్యనారాయణరెడ్డి, డీపీఓ సాయిబాబ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎస్ఓ జ్యోతి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

డీఎల్‌పీవో శ్రీనివాస్‌రావ్

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)



9వ విడత హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని తూప్రాన్ డీఎల్‌పీవో శ్రీనివాస్‌రావ్ సూచించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ దత్తత గ్రామం గౌతోజిగూడలో 9వ విడత హరితహారంలో భాగంగా ఇంటింటికి ఐదు రకాల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరు మొక్కలను పెంచాలని గ్రామంలో ఏర్పాటు చేస్తున్న అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటుతున్న మొక్కలను వీదిలోని వారు దత్తత తీసుకుని మరీ పెరిగే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇంటింటికి పంపిణీ చేస్తున్న మొక్కలను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మీనర్సింలు, సర్పంచ్ బొడ్డు వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షులు పంచమి రేణుకుమార్, కార్యదర్శి నందిని, వార్డు సభ్యులు పెంటమ్మ, భవాని, శ్రీనివాస్, పద్మ, అంజనేయులు, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేష్, సీనియర్ మేట్ నాగమణి, గ్రామ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కుకునూరుపల్లిలో ఆషాడమాస సంబరాలు



నవతెలంగాణ-కొండపాక

కుకునూరు పల్లిలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆషాడ మాస సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వాసవి కన్యకా పరమేశ్వరి మాతను శాకాంబరీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అలాగే మహిళా సభ్యులచే గోరింటాకు సంబరాలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహిళా సభ సెక్రటరీ మాంకాల నాగరాణి, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు కాచం నవీన్, జిల్లా ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల పాండు రంగం, సిద్దిపేట సంతోష్ మాత దేవాలయ అధ్యక్షులు మాంకల్ నవీన్ , దౌల్తాబాద్ మండల ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు పద్మ, కుకునూరుపల్లి ఆర్యవైశ్య మహాసభ గ్రామ అధ్యక్షులు గంగిశెట్టి శ్రీనివాస్, కుకునపల్లి గ్రామ ఆర్యవైశ్య మహా మహిళా విభాగం అధ్యక్షురాలు స్రవంతి, రమ్య , సాయి, చైతన్యకొండపాక వాసవి క్లబ్ అధ్యక్షులు సంతోష్, సెక్రెటరీ ఉప్పలరాజు, కోశాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కుకునూరుపల్లికి చెందిన ఆర్యవైశ్య విద్యార్థిని విద్యార్థులకు హైదరాబాద్ వైశ్య వేదిక ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కార అవార్డులను ఈ సందర్భంగా అందజేశారు.

సమ్మె నోటీసు అందజేసిన సఫాయి కార్మికులు




నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సఫాయి కార్మికులు ఎంపీపీ బాలేశం, ఎంపీడీవో శ్రీనివాస వర్మకు సమ్మె నోటీసులు బుధవారం అందజేశారు. ప్రభుత్వం తరపున తమకు అన్యాయం జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు సఫాయి కార్మికులకు సమ్మె సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని లేనియెడల సమ్మె మళ్లీ పునరావృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాసర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షుడు బింగి మల్లేష్, వార్డ్ సభ్యులు సత్యం, మండల సఫాయి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఎంవీఐ సబ్ ఆఫీస్ ప్రారంభిస్తాం

- మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి



నవతెలంగాణ-దుబ్బాక రూరల్

త్వరలో దుబ్బాక మండలంలో ఎంవీఐ (మోటర్ వెహికిల్ ఇన్స్పెక్టర్) సబ్ ఆఫీస్ ప్రారంభిస్తామని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక మండల కేంద్రంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ కార్యక్రమంలో 18 యేళ్లు పై బడిన యువతీ, యువకులు, ప్రజల నుంచి స్వయంగా ఎంపీ ధరఖాస్తులు తీసుకున్నారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ దూరపు ప్రాంతాలకు వెళ్లి లైసెన్స్ ట్రయల్ కోసం ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. త్వరలోనే దుబ్బాకలో మోటర్ వెహికిల్ ఇన్స్పెక్టర్ సబ్ ఆఫీస్ ప్రారంభిస్తామని తెలిపారు. లర్నింగ్, లైసెన్స్ కోసం వారానికి 3 సార్లు ఎంవీఐ వస్తే ఇబ్బందులు తప్పుతాయన్న పలువురి విజ్ఞప్తి మేరకు తాము కృషి చేస్తామన్నారు. అర్హులైన యువతీ, యువకులకు లైసెన్సులతో పాటు హెల్మెట్లను తాము ఉచితంగా అందిస్తామన్నారు. ఈ నెల 13 వరకు 2, 4 వీలర్ లైసెన్స్, హెల్మెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు 4,075 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కడతల రవీందర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనితా భూం రెడ్డి, ఎంపిపి కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, కౌన్సిలర్లు ఆస యాదగిరి, ఇళ్ళందుల శ్రీనివాస్, రేకుల కుంట ఆలయ ఛైర్మెన్ రొట్టె రమేష్, చిట్టాపూర్ సర్పంచ్ పోతనక రాజయ్య, చికోడ్ సర్పంచ్ తౌడ శ్రీనివాస్, ఏఎంసి డైరెక్టర్లు కోల వెంకట స్వామి గౌడ్, బోడొల్ల దేవరాజ్,బీఆర్ఎస్ నాయకులు చింతల కృష్ణ , యువజన నాయకులు ప్రశాంత్ గౌడ్, పడగాల నరేష్ తదితరులు ఉన్నారు

వృత్తిదారులకు ఉచిత కరెంట్ కల్పించాలి



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

మండల గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న విశ్వ కర్మలు వడ్రంగి, కమ్మరి కంచరి , శిల్పి కౌశలితో పాటు వెల్డింగ్ వర్క్స్ పనిచేస్తున్న వృత్తిదారులకు ఉచిత కరెంటు సౌకర్యం కల్పించాలని బుధవారం అఖిల భారతీయ విశ్వకర్మల సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు రాచమల్ల పున్నమాచార్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఉచిత కరెంటు విశ్వకర్మలకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్ కొత్తపల్లి సత్యనారాయణ, హుస్నాబాద్ మండల అధ్యక్షులు ఎగ్గోజు సుదర్శన చారి, ఉప్పుల శ్రీనివాస్, చెన్నోజు నాగభూషణ చారి, అలవోజ్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గ్రామ హెల్పర్‌కు తీవ్ర గాయాలు



నవతెలంగాణ-నంగునూరు

విద్యుత్ స్తంభంపై మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా కావడంతో గ్రామ హెల్పర్ కు తీవ్ర గాయాలైన సంఘటన సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకులలోని అప్పలాయ చెరువు శివారులో బుధవారం జరిగింది. బాధితుని కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పాలమాకుల గ్రామంలో రేపాక పోశిరెడ్డి గత పది సంవత్సరాలుగా విద్యుత్ శాఖలో గ్రామ హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో అప్పలాయ చెరువు గ్రామ శివారులో ఉన్న రోడ్డు పక్కన పోలుపై గ్రామ లైన్మెన్ బిక్షపతి సమక్షంలోనే సబ్ స్టేషన్‌లో ఎల్సి తీసుకొని మరమ్మతులు చేస్తున్న క్రమంలో ఒకసారిగా విద్యుత్ సరఫరా కావడంతో మంటలు చెలరేగి పోశి రెడ్డికి విద్యుత్ షాక్ తగిలింది. దీంతో తీవ్ర గాయాలైన పోశిరెడ్డి పోల్‌పై నుంచి కింద పడ్డాడు. పోశి రెడ్డికి తొడలు, వీపు భాగంలో కాలిన గాయమైంది. అక్కడే ఉన్న లైన్మెన్ బిక్షపతితో పాటు మరో ఇద్దరు అధికారులు అతన్ని సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోశిరెడ్డికి చికిత్స చేసిన అనంతరం అతని పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. ఎల్సి తీసుకున్నప్పటికీ నిర్లక్ష్యం వహించిన సబ్ స్టేషన్ నిర్వాహకులు ఒకసారిగా విద్యుత్ సరఫరా చేయడంతో ఈ ప్రమాదం జరిగిందని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు. మెరుగైన చికిత్స అందించాలని, తమకు న్యాయం జరిగేలా చూడాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఇసుక అక్రమంగా రవాణా చేస్తే ట్రాక్టర్లు సీజ్ చేస్తాం

- హుస్నాబాద్ ఆర్డీవో బెన్ సలోన్



నవతెలంగాణ-మద్దూరు

ఇసుక అక్రమ రవాణా చేస్తే ట్రాక్టర్లు సీజ్ చేస్తామని హుస్నాబాద్ ఆర్డీవో బెన్ సలోన్ అన్నారు. ఈ సందర్భంగా మద్దూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ధరణి రిజిస్ట్రేషన్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధరణి రిజిస్ట్రేషన్లు తహసిల్దార్ కార్యాలయంలో సజావుగా జరుగుతున్నాయన్నారు. మద్దూరు, దూల్మిట్ట మండలాలలో ఎవరైనా యదేచ్చగా అక్రమ ఇసుక రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు, అధికారుల పర్మిషన్ లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తే ట్రాక్టర్లు సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట తహసిల్దార్ భూపతి, డిప్యూటీ తహసిల్దార్ అశోక్, ఆర్ ఐ రమేష్, తదితరులు ఉన్నారు.

కుంటను తలపిస్తున్న ప్రభుత్వ బాలికల పాఠశాల మైదానం

- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని ప్రభుత్వం బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన రన్నిం గ్ కోర్టు మైదానం చిన్న వర్షానికి కుంటను తల పించేలా ఉందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయలు పెట్టి నిర్మించిన రన్నింగ్ కోర్టు వినియోగంలోకి రాకముందే కుంటను తలపిస్తుందన్నారు. చిన్నపాటి వర్షం వచ్చినందుకే ఇలా కావడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి నిర్మాణాల వల్ల కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారులు లాభపడతారు తప్ప ప్రజలకు ఏం లాభం జరగదన్నారు. నాసిరకం పనులు నిర్మించడంతో కోట్లాది రూపాయల ప్రజాధనం నాశనం అయిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న పనుల్లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలా నాసిరకంగా నిర్మిస్తున్నారన్నారు. వెంటనే విద్యార్థులకు, క్రీడాకారులకు ఉపయోగపడేలా రన్నింగ్ కోర్టును అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గయాజుద్దీన్, అనిల్ , బైరి సాయి తదితరులు పాల్గొన్నారు.

పందిళ్లలో ఉచిత రక్త పరీక్షలు

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని పందిళ్ళ గ్రామంలో లేబర్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉచితంగా రక్త, వైద్య పరీక్షలు గురువారం గ్రామంలో చేయనున్నట్లు సర్పంచ్ తోడేటి రమేష్ తెలిపారు. పందిల్ల స్టేజ్ కమాన్ వద్ద ఉచితంగా చేసే పరీక్షలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుట్టుమిషన్ శిక్షణ మహిళలకు అద్భుతమైన అవకాశం

- పాలమాకులలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ తరగతులు ప్రారంభించిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ-నంగునూరు

ఉచిత కుట్టు మిషన్ మహిళలకు అద్భుతమైన అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ పి.కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 20, 30 మంది మహిళలను గుర్తించి కుట్టు మిషన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాలమాకుల గ్రామంతో మొదలుపెట్టి నియోజకవర్గ పరిధిలోని 5 వేల మంది మహిళలకు కుట్టు మిషన్ తరగతులు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. నంగునూరు మండలం పాలమాకుల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో 50 మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభించామన్నారు. అవసరమైతే రెండవ బ్యాచ్ నిర్వహణ జరిగేలా చూస్తామని హామీనిచ్చారు. అవివాహితులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించామని, ఉచిత శిక్షణ మహిళలకు ఎంతో లాభదాయకమని, అందుకు ప్రతి ఒక్కరూ పక్కాగా కుట్టు మిషన్ శిక్షణ పొందాలని, శిక్షణ అనంతరం మీరంతా స్వశక్తితో ఎదగాలన్నదే తన తపనగా చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

త్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం గర్వంగా ఉంది



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌కు చెందిన మచ్చ మాధురి, ఆకుల రుచిత, బింగి సాయికిరణ్, కల్వకుంట్ల సాత్విక, పోతిరెడ్డి ఉదయశ్రీ, ధర్మాజీపేట వార్డు జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని వై.హేమ, దుబ్బాక జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఉల్లెంగుల హేమలత, మండల పరిధిలోని గంభీర్ పూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని జంగ ప్రణతి, తిమ్మాపూర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థినిలు ఈ.స్వాతి, ఎజి.శివాని, ఎస్.అక్షయ, ఆకారం జడ్.పి.హెచ్.ఎస్ విద్యార్థిని పి.అభినయ, చీకోడు జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని కుర్ర హిమబిందులు బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. పది పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడమే కాకుండా, త్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులను మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. వారు మాట్లాడుతూ 13 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటి సీట్లను సాధించుకోవడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. దుబ్బాక ఖ్యాతిని మరింత పెంచేలా మున్ముందు మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. బుధవారం దుబ్బాక పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో 13 మంది విద్యార్థులను ఎంపి ప్రభాకర్ రెడ్డి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, జెడ్పిటిసి కడతాల రవీందర్ రెడ్డి, ఎంఈఓ జోగు ప్రభుదాస్,ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,సిఆర్ పి నవీన్,మున్సిపల్ కౌన్సిలర్లు దేవుని లలిత,బాలకృష్ణ గౌడ్,ఇల్లందుల శ్రీనివాస్,బత్తుల స్వామి,ఆస యాదగిరి, కోఆప్షన్ మెంబర్ ఆస స్వామి,ఏఎంసీ డైరెక్టర్ బోడోల్ల దేవరాజ్,బిఆర్ఎస్ నాయకులు కొత్త కిషన్ రెడ్డి,చింతల కృష్ణ,చందు రెడ్డి,చరణ్ తేజ, ప్రశాంత్ గౌడ్,పడాల నరేష్, పలువురున్నారు.

సమ్మె నోటీసులు అందజేసిన కార్మికులు



నవతెలంగాణ-దౌల్తాబాద్

మండలంలోని గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారం చేయాలని కోరుతూ జులై 6 నుంచి సమ్మె చేస్తున్నామని పంచాయితీ కార్యదర్శులకు మండల వ్యాప్తంగా సమ్మె నోటీసు ఇచ్చారు. అనంతరం సఫారీ కార్మికుల మండల అధ్యక్షుడు రాజలింగు నాగరాజు మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులు, స్వీపర్లు, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రిషియన్లు, డ్రైవర్లు, కారోబార్లు, బిల్ కలెక్టర్స్ తదితర కేటగిరిలలో నర్సరీలు, వైకుంఠదామం, పార్కులు, ఆఫీస్ నిర్వహణలో విధులు నిర్వహిస్తున్నా వారందరూ గత 20-30 సంవత్సరాలుగా పనులు చేస్తున్నప్పటికీ పంచాయితీ సిబ్బంది పర్మినెంట్, పనికి గుర్తింపు, పని భద్రత, కనీస వేతనాలు, పి.ఎఫ్. ఇ.ఎస్.ఐ. ప్రమాద బీమా లాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని విమర్శించారు.గ్రామ పంచాయతీ సిబ్బందినందరిని పర్మినెంట్ చేయాలని, పంచాయతీ సిబ్బందికి రూ. 19,000 లు చెల్లించాలని,ఆ లోపు జీ.వో. నెం.60లో పేర్కొన్న వేతనాలను కేటాగిరీల వారీగా పంచాయితీ సిబ్బందికి నెలకు రూ. 15,600 లు కారోబార్, బిల్ కలెక్టర్లకు, ఇతర స్కిల్డ్ సిబ్బందికి రూ. 19,500 లు చెల్లించాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు, అసిస్టెంట్ పంచాయితీ కార్యదర్శులుగా ప్రమోషన్ ఇవ్వాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి పాత పద్దతిలోనే వివిధ కేటగిరీలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జెఏసి) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఈ సమ్మె కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాగరి కిషన్, బ్యాగారి లచ్చయ్య అలువాల రమా, దుర్గి పోచమ్మ, రవి, బోటుక రాములు మాందాపూర్ నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చడంలో విఫలమైన ప్రభుత్వం

- నేటి నుంచి సమ్మె బాట పట్టిన పంచాయతీ కార్మికులు



నవతెలంగాణ-మిరుదొడ్డి

గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమవుతుందని సీఐటీయూ మండల కార్యదర్శి మద్దెల అంజయ్య అన్నారు. గ్రామ పంచాయతి కార్మికుల సమ్మెను నేటి నుంచి నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో కార్యాలయంలో సమ్మె నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారు. కానీ వేతనాలు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు .రాష్ట్ర ప్రభుత్వం జీవో జీవో నంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచి ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి, వేతనాలను మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్మికులకు ప్రభుత్వం రూ.25 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న బిల్లును తక్షణమే విడుదల చేయాలన్నారు. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె బాట పడుతున్నామన్నారు. గ్రామాల్లో చెత్త చెదారం జంతు మలమూత్రాలు కుళ్లిపోయిన శవాలు తొలగించి మురికి కాలువలు శుభ్రం చేస్తున్న వారికి కనీస వేతనం ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు . 51ని తీసుకొచ్చి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అదేవిధంగా కేటగిరీలు రద్దు చేసి కారోబర్లు, బిల్ కలెక్టర్‌ను ఆత్మ గౌరవాన్ని దెబ్బతీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



నవతెలంగాణ-కోహెడ

కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నారాయణపూర్, విజయనగర్‌కాలనీ, గొట్లమిట్ట, వింజపల్లి, రాంచంద్రాపూర్, వరికోలు గ్రామాలలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో అర్హులైన వారికి పెన్షన్‌లు, రేషన్‌కార్డులు, పక్కా ఇండ్లు లేకపోవడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కోంటున్నారన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామి ప్రకారం 57 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్‌లు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. భూసమస్యలు అనేకంగా ఉన్నాయని, ఇండ్లు, ఇండ్ల స్థలాలు సైతం మంజూరి చేయలేదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి అర్హులైన నిరుపేదలకు న్యాయం జరిగేలా చూడాలని లేనట్లయితే రానున్న రోజులలో పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గోపి, జిల్లా కార్యవర్గ సభ్యులు కనుకుంట్ల శంకర్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ప్రతాపరెడ్డి, మండల సహాయ కార్యదర్శి భోనగిరి శంకర్, నాయకులు వేల్పుల శ్రీనివాస్, అందె స్వామి, గూడెం లక్ష్మి, నాగెల్లి లక్ష్మారెడ్డి, ముద్రకోల రాజయ్య, తదితరులు పాల్గోన్నారు.

వరిలో విత్తనం వెదజల్లే పద్ధతితో లాభాలు



నవతెలంగాణ-మర్కుక్

వరిలో విత్తనం వెదజల్లే పద్దతతో రైతాంగానికి అనేక లాభాలున్నాయని మండల వ్యవసాయ అధికారి డా. టి.నాగేందర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన మర్కుక్ గ్రామంలో వేదసాగు ద్వారా సాగు చేస్తున్న రాంమోహన్ రెడ్డి పొలంలో బుధవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు 220 ఏకరాలలో వెదజల్లే పద్ధతి ద్వారా సాగు చేస్తున్నారని తెలియజేశారు. నారుమడి పద్ధతిలో ఎకరాకు 25 నుంచి 30 కేజీల విత్తనం అవసరం ఉంటుందని, నారు పెరగడానికి 30 రోజుల సమయం పడుతుందన్నారు. నారు మడికి రూ. రెండువేలకు పైగా ఖర్చవుతుందని. వరినాటు కోసం కూలీలకు ఎకరానికి రూ.5వేల నుంచి రూ. 6వేలు ఖర్చు అవుతుందని తెలిపారు. వెదజల్లే పద్దతిలో వరి సాగు చేయడానికి ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనం మాత్రమే అవసరమవుతుందన్నారు. కూలీల ఖర్చు అసలే ఉండదని. ఒక వ్యక్తి రోజుకి మూడెకరాల వరకు విత్తనం వేసుకోవచ్చన్నారు. రైతు కుటుంబమే విత్తనం వేసుకోవచ్చని. దీంతో ఎకరాకు రూ. 6వేల నుంచి రూ. 8వేల వరకు ఖర్చు మిగులుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విష్ణు వర్ధన్,రైతులు తదితరులున్నారు.

రెవెన్యూ డివిజన్ జేఏసీ కాశగుడిసెల గ్రామ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-చేర్యాల:

చేర్యాలను రెవెన్యూ డివిజన్ గా ప్రకటించి ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలని జేఏసీ నియోజకవర్గ నాయకుడు అందె అశోక్, జేఏసీ మండల కన్వీనర్ బొమ్మగాని అంజయ్య గౌడ్‌లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కాశగుడిసెల గ్రామంలో గ్రామ జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా షేక్ సమీర్, కో కన్వీనర్‌గా సుభాన్, ఖాసీం, కార్యదర్శిగా కమాల్, సహాయ కార్యదర్శి అబ్దుల్ మహబూబ్, కోశాధికారిగా అబ్దుల్, ప్రతినిధులుగా మహబూబ్, దావుద్, సలీం మొత్తం 12 మంది ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జేఏసీ మండల నాయకులు రాంపూర్ మాజీ సర్పంచ్ రంగు శివ శంకర్ గౌడ్, బండారి సిద్దయ్య పాల్గొన్నారు.

గ్రామ పంచయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి




నవతెలంగాణ-మద్దూరు

గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని యూనియన్ మండల గౌరవ అధ్యక్షులు ఆల్టేటి యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికులు జులై 6 నుంచి సమ్మెకు దిగుతున్నామని మండల పరిషత్ కార్యాలయంలో సమ్మె నోటీసును మండల పరిషత్ కార్యాలయంలో అందజేశారు. అనంతరం యూనియన్ మండల గౌరవ అధ్యక్షులు ఆలేటి యాదగిరి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు చాలీచాలని జీతాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీరికి జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలని మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. కారోబార్ బిల్ కలెక్టర్‌లకు సహాయ కార్యదర్శులుగా నియమించాలని వీరిని పర్మినెంట్ చేయాలని పిఆర్సిలో నిర్ణయించిన బేసిక్ ప్రకారం రూ.19 వేలు చెల్లించాలని అలాగే ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మండల నాయకులు మహేందర్ వేణు శేఖర్ యాదగిరి శ్రీకాంత్ కృష్ణ రెడ్డి తిరుపతి రమేష్ ఆంజనేయులు పాల్గొన్నారు.

10న క్రీడా పాఠశాలలో ప్రవేశానికి నైపుణ్య పరీక్షలు

- ఎంఈఓ పావని



నవతెలంగాణ-బెజ్జంకి

క్రీడా పాఠశాలలో 4,5వ తరగతిలో ప్రవేశాలకు మండల కేంద్రంలోని బాలుర ప్రభుత్వోన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 10న నైపుణ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పావని బుధవారం తెలిపారు. 4వ తరగతికి సెప్టెంబర్ 01, 2014 నుంచి ఆగస్ట్ 31,2015, 5వ తరగతికి సెప్టెంబర్ 01,2013 నుంచి ఆగస్ట్ 31,2014 మధ్య జన్మించి, ఆసక్తి గల బాలికలు, బాలురు నైపుణ్య పరీక్షల్లో పాల్గొనాలని ఎంఈఓ తెలిపారు. వివరాలకు బాలుర ప్రభుత్వోన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు మాలతి (9949453619)ని సంప్రదించాలని ఎంఈఓ సూచించారు.

మురికి కాలువల పరిశీలన



నవతెలంగాణ- సిద్దిపేట

35 వ వార్డులో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి మురికి కాలువలను, వార్డులోని రోడ్లను పరిశీలించి అవసరమైన చోట మరమత్తులు, మురికి కాలువల నుంచి చెత్తను తీసే విధంగా చర్యలు చేపట్టినట్లు వార్డు టిఆర్ఎస్ నాయకులు శ్రీహరి తెలిపారు. బుధవారం అయన మాట్లాడుతూ రాత్రి వర్షం బాగా కురిసిందని, దీంతో వార్డులోని కొన్ని ప్రాంతాలలో మురికి నీరు రోడ్లపైకి వచ్చిందని, కొన్ని ప్రాంతాలలో గుంతలు పడ్డాయన్నారు. సమస్యలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించినట్లు తెలిపారు. మంత్రి హరీశ్ రావు సహకారంతో వార్డులో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నట్లు తెలిపారు.


మున్సిపాలిటీ పరిధిలో సీసీ రోడ్లు నిర్మించాలి



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

ఒక్క వర్షం పడితే చాలు సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని చాలా రోడ్లు బురదమయంతో కూరుకుపోతున్నాయని మరమ్మత్తులు చేపట్టి సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని సీపీఎం అర్బన్ మండల కార్యదర్శి రవికుమార్ అన్నారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో సిద్దిపేట పురపాలక కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అండర్ డ్రైనేజ్ పైప్ లైన్ కోసం రోడ్లను తవ్వి, అలాగే వదిలి వేయడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. వర్షాకాలం వస్తుండడంతో గుంతలు తెలియక అనేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రోడ్లను పూర్తిస్థాయిలో నిర్మాణం చేపడితే బాగుంటుందన్నారు. చాలా కాలనీలలో రోడ్లు ఇంకా చాలా అధ్వాన్న పరిస్థితిలో ఉన్నాయన్నారు. రోడ్ల నిర్మాణం చేపట్టని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో పట్టణ ప్రజలను సమీకరించి ఆందోళన చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, కుమార్, మహేష్, రవీందర్ రెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.


రైతుబంధు పథకం , రైతు బీమా పథకం కొరకు దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ మండలంలోని రైతులు రైతుబంధు పథకం , రైతు బీమా పథకం కొరకు దరఖాస్తు చేసుకోని రైతులు జులై ఏడవ(7వ) తేదీలోగా మీ సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి సంప్రదించాలని మర్కుక్ మండల వ్యవసాయాదికారి డా.టి.నాగేందర్ రెడ్డి బుధవారం తెలిపారు. నూతనంగా పట్టా పాసు పుస్తకము వచ్చిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రైతు బంధు,రైతు భీమా దరఖాస్తు చేసుకొనే రైతులు పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డ్ ,బ్యాంక్ అకౌంట్ ఫస్ట్ పేజీ, నామిని ఆధార్ కార్డ్ జిరాక్స్ పేపర్ల ను మీ క్లస్టర్ రైతు వేదికలో ఇవ్వవలసిందిగా కోరారు.

రెండవ రోజు నిరసన తెలుపుతున్న తుక్కాపూర్ గ్రామస్థులు



నవతెలంగాణ-తొగుట

డంపింగ్ షెడ్, స్మశాన వాటిక కూల్చి గ్రామ ప్రజలను అవమానపర్చారని తుక్కాపూర్ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మధ్యాహ్నం భోజన సమయంలో మల్లన్న సాగర్ రిజర్వాయర్ దగ్గర సరైన న్యాయం జరిగే వరకు ఎన్ని రోజులైనా నిరసన చేయడానికి భయపడేది లేదని తేగేసి చెప్పారు. ఇప్పటికైనా గ్రామానికి న్యాయం చేసేం తవరకు పోరాడుతామని చెప్పారు. రెండో రోజుకు చేరుకున్న ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదంటే ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇంత నిర్లక్ష్యం చేయడం తగదన్నారు.

గురుకుల పాఠశాలలో కనీస సౌకర్యాలు కరువు

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్



నవతెలంగాణ-మిరుదొడ్డి

గురుకుల పాఠశాలలో కనీస సౌకర్యాలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ అన్నారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా గురుకుల పాఠశాలల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరుగుతుందని విమర్శించారు. భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే గురుకులాల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను భ్రష్టు పట్టించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడంపై అసహనం వ్యక్తం చేశారు. గురుకులాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉన్నా పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకుల పాఠశాలలో కనీస సౌకర్యాలతో పాటు మెరుగైన విద్య విద్యార్థులకు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. అధికారులు చొరవ తీసుకొని కనీస సౌకర్యాలు విద్యార్థులకు అందే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని పందిళ్ళ గ్రామంలోని మహా లింగేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సంకిటి రాజీ, రవీందర్ రెడ్డి రూ.11,116 లు విరాళం అందించినట్లు సర్పంచ్ తోడేటి రమేష్ తెలిపారు. ఆలయానికి విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావాలని కోరారు.

నవతెలంగాణ

ఎమ్మెల్యే రఘునందన్‌రావును అడ్డుకున్న పోలీసులు



నవ తెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో జరిగిన ఇరువర్గాల ఘర్షణలో గాయపడ్డ సందీప్‌ను పర్మర్శించేందుకు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు బుధవారం గజ్వేల్ పట్టణానికి వస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు ఎవరికి అనుమతి లేదని రానివ్వకుండా అరెస్టు చేశారు. నగరంలోనే ఉండాలని, ప్రస్తుతం గజ్వేల్ పర్యటన అవసరం లేదని పోలీసులు ఎమ్మెల్యేకు నచ్చజెప్పారు. గజ్వేల్ పట్టణంలో ప్రశాంత వాతావరణ నెలకొల్పాలని వెళ్తున్నట్లు పోలీసులకు ఎమ్మెల్యే తెలిపారు. అనుమతి లేదని కళాఖండిగా చెప్పడంతో వెనుకకు వెళ్లిపోయారు.

బాధిత కుటుంబాలను పమర్శించిన దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



నవ తెలంగాణ -దౌల్తాబాద్

కాశీ పుణ్యక్షేత్రానికి వెళ్లి తిరిగి ప్రయాణంలో మెదక్ జిల్లా చేగుంట మండల పరిధిలోని బోనాల గ్రామ శివారులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సిద్దిపేట జిల్లా ఆర్యవైశ్య జిల్లా నాయకురాలు అయిన పబ్బామాధవి, పబ్బ అశోక్ కుటుంబ సభ్యులను, అదే మాదిరిగా మండలం గొడుగుపల్లి గ్రామానికి చెందిన చందా రాములు తన వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ పనులు చేస్తుండగా జరిగిన అడవి పందుల దాడిలో గాయపడి విషయం తెలిసిందే. హైదరాబాద్ వెల్నాక్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకుని వారిని పరామర్శించిన దుబ్బాక శాసనసభ్యులు మాధవనేని రఘునందన్ రావు తెలుసుకుని దుబ్బాక శాసనసభ్యులు మాధవనేని రఘునందన్ రావు పరామర్శించారు.

పోతారెడ్డిపేట హైస్కూల్ విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో చోటు



నవతెలంగాణ దుబ్బాక రూరల్

అక్బర్ పేట భూంపల్లి మండల పరిధిలోని పోతారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులకు బాసర ట్రిపుల్ ఐటీ లో చోటు సంపాదించారు. బాసర 2023 -24 సంవత్సరంలో ప్రకటించిన జాబితాలో టేకులపల్లి దీప్తి, వడ్ల శ్రావ్యా, కాముని శ్రీజ, దూలం స్పందన, గుర్రాల హన్సిక, గొల్ల జ్యోతిక లకు విజయ దుంబి సాధించడం పట్ల బుధవారం విద్యార్థుల తల్లి తండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేయగా..... విద్యార్థులను పోతరెడ్డి పేట్ ఎంపీటీసీ మంద చంద్ర సాగర్, గ్రామ సర్పంచ్, పాలకవర్గం, పోత రెడ్డి పేట హై స్కూల్ హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

యువతను ప్రోత్సాహించెందుకే క్రీడా పోటీలు

సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి

నవ తెలంగాణ- దౌల్తాబాద్

మండల కేంద్రంలో సిద్ధిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు లక్ష్మి ప్రీ కాస్ట్ పీపీ ఇన్ఫ్రా ప్రొడక్ట్స్ అధినేత పలుపునూరి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు. ప్రతీ ఒక్కరూ ఆర్థికంగా ఎదిగితెనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని,చెడు వ్యసనాలకు అలవాటుపడి యువత యవ్వనంలో సమయాన్ని వృథా చేయొద్దన్నారు. గ్రామీణ ప్రాంత యువతను అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు అన్ని విధాల అండగా ఉంటానని అన్నారు. వారితో పాటు స్థానిక సర్పంచ్ యాదగిరి,మాజీ సర్పంచ్ ఆది వేణుగోపాల్, దాకొల్ల ఆంజనేయులు గౌడ్, తుమ్మల గణేశ్, కుమ్మరి శ్రీనివాస్, నర్సింలు, గొల్ల రమేష్, ముదరకొల్ల భాను, కృపాకర్, తదితులున్నారు.

దుబ్బాక ఎమ్మెల్యేకు ప్రజల మీద ప్రేమ లేదు

మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి



నవ తెలంగాణ-దుబ్బాక

'దేశంలో బిజెపి ఉంటుందో పోతుందో అన్న అయోమయంలో ఉంది. ఇటు రాష్ట్రంలో సైతం అలాగే ఉంది. గోడమీద పిల్లి వలే ఎప్పుడు ఎటు దుంకుదామా అని ఎదురు చూస్తున్నాడని ఎమ్మెల్యే రఘునందన్ రావును ఉద్దేశించి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం దుబ్బాక పట్టణ కేంద్రంలోని ఎంపి క్యాంపు కార్యాలయంలో పురపాలిక కేంద్రంలోని 16,19,15వ వార్డులకు చెందిన 50 మంది మహిళలు ఎంపీ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ ఎంపీ ప్రభాకర్ రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.అనంతరం ఎంపి విలేకరులతో మాట్లాడారు.బిఆర్ఎస్ హయాంలో గతంలో ఎన్నడూ లేని విధంగా దుబ్బాక అభివృద్ధి జరిగిందన్నారు. నియోజకవర్గంలో రోడ్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఆసుపత్రులు,స్కూల్లు, కుల సంఘాల భవనాలు ఇలా చెప్పుకుంటూ పోతే అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.ఉప ఎన్నికల్లో ఎన్నో జిమ్మిక్కులు, అబద్ధాలు, మోసపూరిత హామీలిచ్చిన ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఇప్పటివరకు ఒక్క హామీనైనా నెరవేర్చలేదని విమర్శించారు.ఎమ్మెల్యే రఘునందన్ రావు కు ఎమ్మెల్యే సీటు మీద తప్ప దుబ్బాక ప్రజల మీద ప్రేమ లేదన్నారు.ఇక్కడి ప్రజలకు నిజంగా ఏం కావాలి అన్న సోయి అసలే లేదని ఎద్దేవా చేశారు.కల్లబొల్లి మాటలు చెప్పి పబ్బం గడుపుతున్నాడే తప్పా నియోజకవర్గానికి ఎమ్మెల్యే రఘునందన్ రావు చేసిందేమీ లేదని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చడం, ఈడి,ఐటి దాడులతో బిజెపి భయపెడుతుందన్నారు. దేశ ప్రజలు బిజెపి, కాంగ్రెస్ లపై విశ్వాసం కోల్పోయారన్నారు. బిజెపి ఆలంబిస్తున్న విధానాల పట్ల దేశ ప్రజలు విసుగు చెందారని, వచ్చే ఎన్నికల్లో బిజెపిని గద్దె దింపేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.

ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష కార్యదర్శులుగా మహేందర్ రెడ్డి, నవీన్





నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూలిమిట్ట మండలాల ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సమావేశం చేర్యాల మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హల్ లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మంతెన చంద్రారెడ్డి, అధ్యక్షులుగా కడుదూరి మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కర్క చంద్రారెడ్డి, ఎండి. షాబీర్ పాషా, అశోక్ రాజ్, పిల్లి ఆనంద్, నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా రేణిగుంట నవీన్, సహాయ కార్యదర్శులుగా అయిత నందు, సుధాకర్, వినోద్, కోశాధికారిగా బాల లింగం లను ఎన్నుకున్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు



38

నవ తెలంగాణ రాయపోల్

విద్యార్థులందరినీ తల్లిదండ్రులకు ప్రోత్సహిస్తూ ఉన్నత చదువులు చదివించాలని అలాంటప్పుడే సమాజంలో గుర్తింపు విలువలు ఉంటాయని సాయి అక్షయ పుణ్య అసోసియేషన్ ప్రతినిధి వినయ్ కుమార్ అన్నారు.బుధవారం రామారం, వడ్డేపల్లి, బేగంపేట పాఠశాలలో తల్లి తండ్రిలేని 93 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్, డిక్షనరీ,జామెట్రీ బాక్స్ ఇతర స్టేషనరీ సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ప్రోత్సహిస్తేనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. చదువుకుంటేనే సమాజంలో ఉన్నతమైన గుర్తింపు విలువలు ఉంటాయన్నారు.దేశం అభివృద్ధి చెందాలంటే అక్షరాస్యత శాతం పెరగాలన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయి అక్షయ పుణ్య అసోసియేషన్ సభ్యులు నర్సింలు గౌడ్ ,సాయి కిరణ్,సోను,పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, నర్సింగరావు, తులసీదాస్, మధుసూదన్ రెడ్డి, వరప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రి కురిసిన వర్షానికి కూలిన ఇల్లు



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక కేంద్రంలోని 13 వ వార్డు ఎస్సీ కాలనీ లో నివసి స్తున్న గజ్జల రాజయ్య కు చెందిన పెంకుటిల్లు నిన్న రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది.ఇదే ఇంట్లో రాజయ్య తన భార్య రాజవ్వ, కుమారుడు, కుమార్తెలతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి ఇల్లు పూర్తిగా తడిసి కూలిపోయిందని,తన భర్త రాజయ్య గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడని బాధితురాలు రాజవ్వ తన గోడును వెళ్ళబోసుకున్నాడు.నిరుపేద అయిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వంతెన నిర్మాణం చేపట్టాలని సీపీఐ ఆందోళన



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మండల పరిధిలోని కడవేరుగు గ్రామంలో ధ్వంసమైన రోడ్డుపై వంతెన నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం కడవేరుగు కల్వర్టు రోడ్డుపై ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు అందె అశోక్ మాట్లాడుతూ చేర్యాల మండల కేంద్రం నుంచి కడవేరుగు మీదుగా పోతిరెడ్డిపల్లి, పెద్దరాజు పేట, నాగపురి, శభాష్ గూడెం, కొండపోచమ్మ ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టకు వెళ్లే రహదారి కడవేరుగు గ్రామ చెరువు మత్తడి దగ్గర రోడ్డు కల్వర్టు పూర్తిగా ధ్వంసమై నీరు ప్రవహిస్తుందన్నారు. నిత్యం వందలాది మంది ఆ రహదారి వెంబడి ప్రయాణాన్ని కొనసాగిస్తుంటారన్నారు. వర్షాలు విస్తృతంగా కురుస్తుండడంతో రహదారి పూర్తిగా ధ్వంసమై నీటి ప్రవాహం పెరిగి ప్రతీ సంవత్సరం ఇదే సమస్య పునరావృతం అవుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల స్థాయి ప్రజా ప్రతినిధులు ఇదే రహదారి వెంట నిత్యం ప్రయాణం చేస్తుంటారని కానీ మరమ్మతులు చేయాలని, బ్రిడ్జి నిర్మించాలనే ఆలోచన మరిచారని విమర్శించారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రోడ్ల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండడంతో ఏదైనా అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు మండల కేంద్రానికి రావాలంటే ఏలాంటి పరిస్థితి ఎదురవుతుందో పాలకులు గమనించాలన్నారు. సంవత్సరం క్రితం బ్రిడ్జి నిర్మాణానికి తాత్కాలికంగా రూ.10 లక్షలు మంజూరు చేసి నేటి వరకూ పనులు చేపట్టకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి పెట్టి యుద్ధప్రాతిపదికన బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కత్తుల భాస్కర్ రెడ్డి, తిగుల్ల రాకేష్, అందె కిరణ్, గర్నపల్లి నరేశ్, పోరెడ్డి సునంద, రమేష్, మల్లయ్య, సురేందర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈటెల రాజేందర్‌ను కలిసిన మురళీధర్ యాదవ్



నవతెలంగాణ-నర్సాపూర్

హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌ను బీజేపీ అధిష్టానం బీజేపీ రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్‌గా నియమించడంతో బుధవారం నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్ హైదరాబాదులో ఈటెల రాజేందర్‌ను కలిసి శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కౌన్సిలర్ లతా రమేష్ యాదవ్, హత్నూర మండల అధ్యక్షులు నాగ ప్రభు, మాజీ ఎంపీపీ అశోక్, నాయకులు సతీష్ యాదవ్ తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ గుడిలో దొంగతనం



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట మండలపరిధిలోని నందగోకుల్ గ్రామంలోని ఎల్లమ్మ గుడిలో బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు అమ్మవారి పుస్తెమట్టేలు, వెండి మట్టెలు, వెండి పాదాలను, పంచలోహ విగ్రహం, రూ.6 వేలు ఎత్తుకొని వెళ్లారని యాదవ కుల సంఘ అధ్యక్షుడు కృష్ణ పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-నార్సింగి

గ్రామ సర్పంచ్ షరీఫ్ షేక్ మరో సారి మానవత్వాన్ని చాటుకున్నారు. నార్సింగి మండలం జప్తీ శివనుర్ గ్రామం నివాసి బొమ్మర్తి రామయ్య భార్య రాజవ్వ గత రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధ పడుతూ బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ షరీఫ్ షేక్ మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు సర్పంచ్ ప్రతి బాధిత కుటుంబాలను ఆదుకోవడంపై ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షరీఫ్‌తో పాటు వార్డు సభ్యులు నయీం, సతీష్ బాబు, స్వాతి, స్వామీ, మాజీ సర్పంచులు అంజయ్య, పర్శురాములు, కో ఆప్షన్ సభ్యుడు బలమల్లయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు చాంద్ పాషా, మున్వర్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి అండగా ఎంఎస్ఎస్ఓ



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట మండల పరిధిలోని నందిగామ గ్రామంలో లద్ద సంజీవ్ అనే కూలి బ్లెడ్ క్యాన్సర్ తో బాద పడుతూ బుధవారం మరణించారు. ఈ విషయాన్ని ఎంఎస్ఎస్ఓ సభ్యుల ద్వారా తెలుసుకొని మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ చైర్మెన్ డా. మైనంపల్లి రోహిత్ రావ్ తక్షణ సహాయం రూ.5000/- మృతుని భార్య ఎల్లవ్వకు ఎంఎస్ఎస్ఓ సభ్యుల ద్వారా అందజేశారు. మైనంపల్లి రోహిత్ అన్ని విధాల అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కుటుంబసభ్యులు గ్రామస్థులు మైనంపల్లి రోహిత్‌కి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, లింగస్వామి , అజయ్,అంజిరెడ్డి ,సత్యం , సిద్ధి రాములు, లద్ద బాబు ,లద్ద శాంతి ,లద్ద జీవన్ కుమార్, లద్ద స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాసర త్రిబుల్ ఐటీలో సత్తాచాటిన విద్యార్థులు



నవతెలంగాణ-కోహెడ : కోహెడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విదార్థులు, వింజపల్లి గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థులు బాసర త్రిపుల్ ఐటీ సీటు సంపాదించి సత్తాచాటారు. కోహెడకు చెందిన విద్యార్థులు గౌరిట్యాల రుతిక, వనపర్తి శ్వేత, ఎడ్ల రిషిత, పొన్నాల ధనాంజలి, చేగూరి సాత్విక, జాలిగం అక్షిత, వింజపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు సామ హర్షవర్ధన్‌రెడ్డి, చిట్యాల అమూల్య, బొలుమల్ల శ్రద్ధ, గుడిపల్లి లక్ష్మిలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పెరుగు దేవేందర్‌రెడ్డి, ఎస్మెమ్సీ చైర్మన్ నేదునూరి సదానందం, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

నేడు ప్రాంతీయ క్రీడా పాఠశాలలకు ఎంపికలు

నవతెలంగాణ-నంగునూరు : మండలంలో ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు తెలియజేయునది ఏమనగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రాంతీయ క్రీడ పాఠశాలల ఎంపికలు గురువారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు పోటీల నిర్వాహకులు, మండల విద్యాధికారి తగిరెడ్డి దేశి రెడ్డికి తెలిపారు. 2023 -2024 విద్యా సంవత్సరంలో నాలుగు, ఐదు తరగతుల ప్రవేశాలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

యువ పోరాట యాత్రకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

తెలంగాణ యువజన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు శివసేనారెడ్డి ఆద్వర్యంలో నెల రోజుల పాటు చేపడుతున్న యువ పోరాట యాత్ర కార్యక్రమానికి మనోహరాబాద్ మండలం కాళ్ళాకల్ నుంచి బుధవారం భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ బైక్ ర్యాలీగా గజ్వెల్ మండలం అవుసలపల్లికి తరలివెళ్లారు. ఈ యవపోరాట యాత్ర కార్యక్రమానికి ఆల్ ఇండియా యువజన కాంగ్రెస్ విభాగం అధ్యక్షులు బివి శ్రీనివాస్, ఆల్ ఇండియా యువజన కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు అల్లవరపు కృష్ణలు ముఖ్య అతిథులుగా హజరవుతున్నందున మండలం నుంచి భారీ ఎత్తున పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీగా తరలిరావాలని సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి ఇచ్చిన పిలుపుతో భారీగా తరలివెల్లారు. తెలంగాణలో అవినీతిని అంతం చేయడానికి యువకులు, మహిళల హక్కుల కోసం నెల రోజుల పాటు యాత్రను చేపడుతున్నట్టు తెలిపారు. ఈ యాత్రకు ప్రతి ఒక్కరు కలిసి రావాలని కోరారు.

సంపద వనాల ఏర్పాటుకు స్థల పరిశీలన



నవతెలంగాణ- కొల్చారం

సంపద వనాల ప్లాంటేషన్ ఏర్పాటు కోసం డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీఎఫ్ ఓ రవి ప్రసాద్, ఈఈ శ్రీనివాస్ రావులు బుధవారం కొల్చారం మండలం వరిగుంతం గ్రామాన్ని సందర్శించి స్థల పరిశీలన చేశారు. కొల్చారం మండలంలోని అంసానిపల్లి, వెంకటాపూర్, వరిగుంతం గ్రామాల్లో సంపద వనాల ప్లాంటేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందుకోసం త్వరితగతిన అనుకూలమైన స్థలాన్ని ఎంపిక చేసి పూర్తి స్థాయి నివేదికను అందజేయాలని ఎంపీడీవో గణేష్ రెడ్డికి సూచించినట్లు తెలిపారు. ఆయన వెంట ఏపీవో మహిపాల్ రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ సుధార్షన్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



నవతెలంగాణ- కొల్చారం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలైన సంఘటన కొల్చారం మండలం రంగంపేటలో మెదక్- జోగిపేట ప్రధాన రహదారిపై బుధవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కౌడిపల్లి మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన తోండ్రు శివరాజు, రంగంపేట గ్రామానికి చెందిన సాయిలు ద్విచక్ర వాహనాలపై ఎదురెదురుగా వస్తూ అదుపు తప్పి రంగంపేట శివారులోని టీ పాయింట్ సమీపంలో బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో తోండ్రు శివరాజు తలకు తీవ్ర గాయమై రక్తస్రావమైంది. అతన్ని వెంటనే 108 వాహనంలో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మరో వ్యక్తి సాయిలుకు కాలుకు గాయాలైనట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-చేర్యాల

మద్దూరు మండలం సలాక్ పూర్ గ్రామానికి చెందిన వగలబోయిన రక్షిత్ చేర్యాల పట్టణ కేంద్రంలో నివాసం ఉంటున్నాడు. అతను గత కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కిరాణ వర్తక సంఘం అధ్యక్షులు శేరి బాలనారాయణ గుప్త, పడకంటి ఉమాకాంత్ ఆధ్వర్యంలో కొంత మంది దాతల ద్వారా సేకరించి వచ్చిన రూ. 61.563 వేలను బుధవారం మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు.

బాలల హక్కులను కాపాడాలని తహశీల్దార్‌కు వినతి



నవతెలంగాణ- కొల్చారం

బాలల హక్కులను కాపాడాలని కొల్చారం తహశీల్దార్ చంద్రశేఖర్ రావుకు కొల్చారం మండల కమ్యూనిటీ సోషల్ మొబిలైజర్ కార్వేడ్ సంస్థ కో ఆర్డినేటర్ సత్యనారాయణ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలో కైలాష్ సత్యార్థి సెంటర్ ఫర్ యాక్షన్ రీసెర్చ్ పీపుల్స్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కల్పించాలని కోరడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా బాల్య వివాహాలు, చిన్నపిల్లల అక్రమ తరలింపు, బడీడు పిల్లలు, ఆడపిల్లల పైన జరిగే లైంగిక వేధింపులు, ఉచిత విద్యా నిర్బంధ హక్కు చట్టం, కార్మికుల వ్యవస్థను నిషేధించాలనే అంశాల పైన తల్లి తండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఏదేమైనా బాలల హక్కుల పై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రభాకర్ ఉన్నారు.

కొండపాకలో భారీ వర్షం

నవతెలంగాణ-కొండపాక : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది సుమారు 130 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షాకాలం ప్రారంభమై నెల రోజులైనప్పటికీ వానలు కురువకపోవడంతో రైతులు నిరాశకు గురయ్యారు అలాగే జూలైలో సైతం ఎండ వేడిమి తగ్గలేదు భారీ వర్షంతో తొలకరి పులకరించినట్టుంది వాతావరణం చల్లబడింది. భారీ వర్షానికి పలు గ్రామాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. దుద్దెడ నుంచి బంగారం అంకిరెడ్డిపల్లికి వెళ్లే దుద్దెడ సమీపంలోని రోడ్డు బ్రిడ్జి పై నుంచి నీరు పారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొద్దిసేపు వాహనాలు నిలిచిపోయాయి. మర్పడగ ఉన్నత పాఠశాల ఆవరణ మొత్తం నీటితో నిండిపోయింది పాఠశాల భవనం చుట్టూ జలమయమైంది.

అనాధలను సాయి అక్షయ ఫౌండేషన్ ఆదుకుంటుంది

నవ తెలంగాణ-గజ్వేల్ : అనాధ పిల్లలను, అనాధ కుటుంబాలను సాయి అక్షయ ఫౌండేషన్ ఆదుకుంటుందని నిర్వాహకులు వెంకట్ కిరణ్, దూలం నరసింహ గౌడ్ తెలిపారు. బుధవారం గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామంలో పాఠశాలలో ఉన్న అనాధ పిల్లలకు బుక్స్ బాక్స్ జామెట్రీ బాక్సులు పంపిణీ చేశారు. గజ్వేల్ పాత తాలూకా పరిధిలో ఇప్పటివరకు రాయవరం, వడ్డేపల్లి, కొడకండ్ల తదితర గ్రామాల్లో 93 మంది అనాధ పిల్లలకు వీటిని పంపించేశామని వారు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ పాఠశాలకు పరిధిలో తమ స్వచ్చంద సంస్థ ముందుండి తగిన సాయం అందిస్తామన్నారు. అనాధ పిల్లలకు చదువుకునేందుకు అన్ని విధాల ఆదుకుంటామని వారు తెలిపారు. తల్లిదండ్రులు లేరని అధైర్య పడవద్దని వారు విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు చదువుకోవాలని, అన్ని వసతులు ఉన్నాయని వారు సూచించారు.

బాధిత కుటుంబానికి బియ్యం అందజేత

నవతెలంగాణ-బెజ్జంకి : మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బోనగిరి రాజయ్య ఇటీవల మృతిచెందగా స్థానిక అంబేద్కర్ యువజన సంఘం అధ్వర్యంలో బాధిత కుటుంబానికి బుధవారం 25 కిలోల బియ్యం అందజేశారు. అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమానత్వం, సామజిక న్యాయమే ఎమ్మార్పీఎస్ ఆశయం

నవ తెలంగాణ- గజ్వేల్

సమాజంలో నెలకొని ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను నిర్మూలించి సామాజిక సమానత్వం సాధించడమే ఎమ్మార్పీఎస్ ఆశయమని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా జిల్లా కో ఇంచార్జి మైస రాములు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ ముంద్రా తి కృష్ణ మాదిగలు అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భారత దేశంలో డా. బి. ఆర్ అంబేద్కర్ నడిపిన ఉద్యమం తరువాత అతి పెద్ద సామాజిక ఉద్యమం మంద కృష్ణ మాదిగ నడుపుతున్న దండోరా ఉద్యమం మాత్రమేనన్నారు. రాజ్యాంగ ఫలాలు జనాభా ప్రాతపదికన అన్ని కులాలకు లభించి సామాజిక న్యాయం అమలు చేయాలని పాలకుల మీద పోరాటం చేస్తుందన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని చూసి మాదిగలు, పీడితులు, అణగారిన వర్గాల ప్రజలు గర్వపడాలన్నారు. ఎమ్మార్పీఎస్ 29 వ అవిర్భావ వేడుకలను జూలై 7 న ఉదయం 9 గంటలకు గజ్వేల్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహిస్తున్నామన్నారు. కావున మాదిగ, ఉప కులాలు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గజ్వేల్ మండల ఇంచార్జి ఉబ్బని ఆంజనేయులు మాదిగ, నాయకులు చిట్యాల రవీందర్, నవీన్ స్వామి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.